GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026

పూజ్య గురుదేవుల 78వ జయంతి క్యాలెండర్ 2026



Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.

IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043


గిరిధారి

ఫిబ్రవరి 2026

శాశ్వత చందా రూ.1200/-
10 సం॥లకు



చిరస్మరణీయం - పూజ్య గురుదేవుల 78వ జయంత్యోత్సవం




గుండెలలో చెదరని సందేశాలు




ప్రార్థన





శ్లో॥ హృదంబుజే కర్ణిక మధ్య సంస్థే
సింహాసనే సంస్థిత దివ్యమూర్తిమ్ ।
ధ్యాయేద్గురుం చంద్రకలా ప్రకాశం
సచ్చిత్సుఖాభీష్టవరం దధానమ్ ॥

హృదయ పద్మము నందలి కర్ణిక మధ్య నున్న సింహాసనము నందు చక్కగా ఆసీనుడై యున్న ప్రకాశ రూపుడు, చంద్రరేఖ వలె కాంతిమంతుడు, సచ్చిదానంద స్వరూపుడు, కోరిన వరముల నొసగు వాడు నైన సద్గురుదేవుని ధ్యానించ వలెను.



పండుగలు

15-2-2026 - మహాశివరాత్రి

గీతాధార

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 41 సంచిక : 3

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

సంపాదకులు : **శ్రీ స్వామి సుందర చైతన్యానంద**


జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com (*email : admin@sundarachaitanyam.org*)



ఆప్తవాక్యం

శివ కుటుంబం

మానవ దేహము ఈ లోకంలో పట్టున పదిపదులైనా ఉండదు. ఈ మధ్య కాలంలో సంసారము ఉండేదెంతసేపు? ఊడేదెంతసేపు?

ఉన్నంతకాలం తోడుగా ఉండదు

పోయేనాడు నీడలా వెంబడించదు.

కాలప్రవాహంలో కూడేదెప్పుడో తెలియదు. వీడేదెప్పుడో అర్థం కాదు.

ఈలోగా - సంసారం ...... సంసారం

మహాసాగరం - దుస్తరం - అంటూ అరుస్తూ అలసిపోతుంటాము.

సంసారాలు బంధహేతువులు కావు

సంసార భావనే బంధహేతువు.

ఈ సత్యం అవగతమైతే, సంసారంలో కూడా సారమే ఉంటుంది. సారరూపుడైన పర మాత్మే ఉంటాడు. పరమాత్మ ఉండేచోటు మంగళకరంగా ఉంటుంది. శివప్రదమై, శుభప్రదమై ఉంటుంది.

ఈ సత్య నిరూపణకే భగవంతుడికి కూడా కుటుంబం తయారైంది.

అదే *'శివ కుటుంబం'*

చిక్కులు లేని కుటుంబం. చింతలు లేని కుటుంబం. స్పర్ధలు తెలియని కుటుంబం. వ్యర్థం గాని కుటుంబం.

మన కుటుంబాలు కూడా శివ కుటుంబాలు కావాలి. అవగాహన ఉంటే, సంసారాలు కైవల్యా లవుతాయి. కైలాసా లవుతాయి.

పరిస్థితులు దుఃఖానికి కారణం కావు, ప్రవర్తనే కారణం.

ఈ సత్యం తెలిస్తే, సంసారం కోఱలు తీసిన పాములా మనముందే ఆడుతూ ఆనందాన్ని పంచుతుంది.

ఇది సాధ్యమా? సాధ్యమే. ఇలాంటి కుటుంబము ఎక్కడైనా ఉందా? ఉంది. ఎవరిది? శివునిది. మహేశ్వరునిది.

చూడండి. శివకుటుంబం ఎలా ఉందో!

ఒక ఇల్లాలు. ఇద్దరు పుత్రులు గల కుటుంబం శివునిది.

ఆయన వాహనం నంది. భార్య వాహనం సింహం. . . . . ఈ రెండు జంతువులకు బద్ధ శత్రుత్వమనే విషయం వేరే చెప్పక్కర్లేదు.

ఒక కుమారుడి వాహనం మూషికం మరొక కుమారుడి వాహనం మయూరం. తండ్రి మెడలో ఆభరణం సర్పం. . . . సరిపోయే, వీటిలో ఒకటి మరొకటితో సరిపడి ఉండవు.

కుటుంబమంతా ఒకే చోటికి ప్రయాణమైనా, అందరూ ఒకే కాలంలో చేరలేరు. ఎవరి గమనం వారిదే. ఎవరి గమ్యం వారిదే. వారి వాహనాలు అలాంటివి.

ఇది *శివ కుటుంబం.*

కానీ, ఈ కుటుంబ సభ్యులందరూ ఎంత హాయిగా ఉన్నారో చూశారా!

రూపాలు వేరుగా ఉన్నా, స్వరూపం ఒకేలా ఉంది.

అనేకములున్నాయే గాని అనేకత్వం లేదు. భిన్నత్వముందే గాని భేదం లేదు.

ఇదే శుభానికి సంకేతం. శివ కుటుంబ సందేశం.

ఒక కుటుంబంలో ఎందరో ఉంటారు. అందరి ప్రారబ్ధాలు ఒకేలా ఉండవు. ఎవరెవరి పరిమితాలు వారికి ఉంటాయి.

ప్రవర్తనా సరళిలో వ్యత్యాసాలుంటాయి. ఆలోచనలు వేరుగా ఉంటాయి. అభిరుచులు వేరుగా ఉంటాయి. అవసరాలు వేరుగా ఉంటాయి. ఆశలు వేరువేరుగా ఉంటాయి.

ఎవరు, ఎందుకు, ఎలా ఉన్నారో - అర్థం కాకపోయినా, అంతకన్నా మరో విధంగా ఉండటం వారిచేత కూడా కావటం లేదు - అనే సత్యాన్ని సహృదయతతో అర్థం చేసుకున్ననాడు,

ద్వేషాలు, సంతాపాలు దూరమై
ప్రేమలు, సానుభూతులు చిగురిస్తాయి.

వైకల్యాలు అదృశ్యమై కైవల్యాలు దర్శనమిస్తాయి.

పుట్టింట అన్నీ ఉన్నాయి.

అత్తగారింట్లో అక్షయపాత్రే ఆస్తి. దానినే అక్షయ సంపదగా భావించింది హైమావతి.

అత్తగారింట్లో ఏమీ లేకపోవచ్చు. ఆత్మీయతను, ప్రేమను పంచే భర్త ఉన్నాడు అనే భావనే పార్వతీదేవి ఆనందానికి మూలం.

ఏదో కావాలని శివుడు పరితపించలేదు.


అంతర్ముఖుడై ఉన్నదానితో తృప్తి చెందాడు.

ఏదో లేదని, మరేదో రాలేదని సంసారులు అలమటిస్తుంటారు.

ఏదో ఉందని, మరేదో పోలేదని సదా కుటుంబాలలో ఆందోళన చెందుతూ ఉంటారు.

ఉండేందుకు వచ్చింది పొమ్మన్నా పోదని

పోయేందుకు వచ్చింది ఉండమన్నా ఉండదని...... గ్రహించిన మహేశ్వరుడు



ఓ బొజ్జ గణపయ్యను

ఆ బుజ్జి ఎలుకమ్మను,

ఆరు ముఖాల కుమారుని

తుర్రుమనే తోకమ్మను

మరొకరికి తల వంచని మృగరాజును

దించిన తల ఎత్తని వృషభరాజును

ఓ ప్రక్కన

కళ్ళెర్ర జేసే కాళీని

మెడలో బుసలుకొట్టే కాళమును - తోడుగా పెట్టుకున్నా,

శివుడు సదా ధ్యానమయుడే

శాంతి మయుడే

సార రూపుడే, సంసార రూపుడే.

ॐ స్వామి సుందర చైతన్యానంద

అద్వైతామృత ఆనందప్రియ

పాట (చైతన్య గానం - 5) **శ్రీమతి సి.పద్మ**

పల్లవి : అద్వైతామృత ఆనందప్రియ
అగణిత గుణగణ సుందరశివ
సుందరశివ - సుందరేశ శివ! ॥ అద్వైత ॥



చరణములు :

1. ఛిద్రమైన జీవితాలకు
భద్రనౌకవు రుద్రదేవా!
బరువు బ్రతుకుల బాధల నణచి
బోధలు పంచే భువనవంద్య ॥ అద్వైత ॥

2. తోడు నీడ నాకు లేదు
ఆశ ఒక్కటే నాకు తోడు
సుందరమైన నిన్ను వలచి
ఆశ కూడ నన్ను విడిచె ॥ అద్వైత ॥

3. పుట్టి చేసిన పుణ్య మేదో
పంచ చేరి కంచమాయె
వల్లకాటి భాగ్యమేదో
తానె నీకు మంచమాయె
బుద్ధులున్న నేరమునకా
నరుల బ్రతుకు వంచనాయె ॥ అద్వైత ॥

4. తలచిన లూతకు శుభగతి
పిలిచిన హస్తికి సుకువది
వలచిన నాగును కనికరించి
కొలచిన మాకు దూర మైతివా! ॥ అద్వైత ॥

జన్మించిన ప్రతి మనిషి సుఖపడాలనే ఆశిస్తాడు. జన్మ తన చేతిలో లేకపోయినా సుఖాన్ని మాత్రం తన హస్తగతం చేసుకోవాలనే ఆశిస్తాడు. ఆశించినంత మాత్రాన ఆనందం అందాలని లేదు. అందనంత మాత్రాన మనిషి ఆశను వీడలేడు. జీవితంలో మనం అనుభవించేవి ప్రారబ్ధ ఫలాలే కాని ఆశలకు ఫలితాలు కావు. అయినా జీవితాన్ని ఆధారం చేసుకొని ఆశాలత చిగురిస్తూ ఉంటే ఆశలే పువ్వులై జీవితంలో అందాన్ని నింపుతున్నాయి, జీవితానికి అర్థాన్ని చెబుతున్నాయి, పరమార్థం వైపుకు మనిషిని నడుపుతున్నాయి.

ఏ ఆశ లేకుండా తల్లి బిడ్డకు జన్మనివ్వదు. ఏ ఆశ లేకుండా వ్యక్తి తన జీవితాన్ని మరొకరితో పంచుకోవాలని అనుకోడు. ఏ ఆశ లేకుండా శిష్యుడు గురువును ఆశ్రయించడు, గురువు శిష్యుడిని ఆశీర్వదించడు. ఇవన్నీ ఆశలే. ఉన్నతమైన ఆశలు. కాని, ఈ ఆశలన్నిటి వెనుక ఉన్న ఏకైక ఆశయం వెలుగులోకి వచ్చినప్పుడే జీవితంలో వెలితి తొలుగుతుంది, జీవిత పరమార్థం అవగత మవుతుంది.

ఎన్ని నమ్మకాలు వమ్మైనా, ఎన్ని ఆశలు అడియాసలైనా వ్యక్తి ఆశను వీడక పోవడానికి కారణం తను ఆశించదగిన నిత్యవస్తువు ఒకటి ఉండడమే. అది ఏమిటో అందరికి అర్థం కాని విషయం. కాని, తెలిసో తెలియకో అందరు పయనించేది ఆ దిక్కుకే, ఆ గమ్యం వైపుకే. అనిత్య సుఖాలకై అర్రులు చాస్తూ లౌకికులు లోకంలో పరిభ్రమిస్తూ ఉంటే నిత్య సుఖాన్ని అన్వేషించే వివేకవంతులు సద్గురువును ఆశ్రయించి తరించి పోతుంటారు. లౌకికులు రాగులు, వివేకవంతులు విరాగులు. “విరాగి అంటే నిరాశావాది కాదు, పరమ ఆశావాది” అనేదే పూజ్య గురుదేవుల విశ్లేషణాత్మకమైన బోధ. అంటే ఇహము నందు కాక పరము నందే ఆశ కలవాడు, పరమ ఆశ కలవాడు. నిరాశ వల్ల కాక విచారణ ద్వారా విషయ భోగాలు తుచ్ఛములని ఎరిగినవాడు. అనంత సుఖాన్ని ఆశిస్తూ, దానికి అల్ప సుఖాలు అవరోధాలని తెలిసి త్యజించువాడు. ఏది ఉండడం వల్ల వ్యక్తిలో ఆశలు కదులుతూ ఉన్నాయో, ఎవరు ఉండడం వల్ల ఆంతర్యంలో సుఖాను భవం కలుగుతూ ఉందో, అటువంటి నిత్యాత్మ ఆశానిరాశలకు, రాగవిరాగాలకు అతీత మైంది. కనుక వైరాగ్యం సాధన దశ. సిద్ధావస్థలో రాగము లేదు, విరాగము లేదు. సిద్ధుడు దేనినీ పట్టుకోడు కనుక దేనినీ విడిచిపెట్టే అవసరం లేదు. ఏదీ కోరడు కనుక ఏదీ త్యజించడు. అద్వైత సిద్ధి పూర్ణ స్థితి. అది కేవలం జ్ఞానం, కనుక తెలుసుకోదగింది. ఏదో చేసి దేనినో పొందడం కాకుండా దోసపండు తీగ నుండి విడిపడిన విధంగా ఉన్న దగ్గరే ఉంటూ ఉన్నవాటి నుండి విడిపడి ఉండడమే మోక్షం. అందుకే **‘ఉర్వారుక మివ బంధనా న్మృత్యో ర్ముక్షీయ మామృతాత్’** అంటూ మోక్షప్రదాత, మంగళ స్వరూపుడు అయిన పరమశివుని ప్రార్థిస్తాము.

సర్వం తానైనవాడు, తనకన్నా అన్యంగా ఏదీ లేనివాడు శివుడు. కనుక శివుడు రాగి కాడు, విరాగి కాడు. అందుకే అద్వైతానందామృతాన్ని ఆంతర్యం లోనే ఆస్వాదిస్తూ సదా ధ్యానమగ్నుడై ఉంటాడు. హృదయంలో వైరాగ్య జ్వాలను రగిల్చి, జ్ఞానాగ్నిచే మాయను భస్మీకరించి, సంసారాన్ని సమూలంగా నశింప చేసే ఆదిభిక్షువును మించిన ఆరాధ్య మూర్తి ముముక్షు లోకానికి మరొకరు కలరా? అందుకే,

అద్వైతామృత ఆనందప్రియ, అగణిత గుణగణ సుందరశివ
సుందర శివ - సుందరేశ శివ!

అంటూ, ప్రియరూపుడు, ఆనందప్రదాత, అమృతత్వాన్ని ప్రసాదించువాడు అయిన సుందరేశ్వరుని అగణిత గుణగణాలను భక్తి పారవశ్యంలో, మృదుమధుర కంఠంతో కీర్తిస్తున్నారు మన ప్రియ గురుదేవులు, శ్రీ సుందర యతివరేణ్యులు.

అంతులేని ఈ ప్రపంచంలో మానవుడు చాలా చిన్నవాడు. ఇచ్ఛాశక్తిలో, క్రియాశక్తిలో, జ్ఞానశక్తిలో పరిమితమైనవాడు. అందుకే అడుగడుగునా అతడు ఊహించేది ఒకటి, జరిగేది మరొకటి. ఊహించనివి జరగడమే జీవితంలో బాధలు. బాధలు ఎదురైనపుడు అవి అనివార్యాలే కాని అసంభవాలు కావని, అసంభవాలు అయితే అసలు జరగవని, అనివార్యాలు కనుకనే జరిగాయి అనే అవగాహన సద్గురు బోధలోనే మనిషికి అందాలి. బోధను అందుకునే బుద్ధిని భగవంతుడు మనిషికి మాత్రమే ఇచ్చాడు. మనిషై పుట్టి కూడా గురువును ఆశ్రయించనివాడు దురదృష్టవంతుడు. బ్రహ్మకు అసలు అవతారాలే లేవు. విష్ణువు అవతార కాలం లోనే కనిపిస్తాడు. మహేశ్వరుడు మాత్రం గురురూపంలో సదా మానవాళికి తోడు గానే ఉన్నాడు. అలల తాకిడికి నావ తూట్లు పడినట్లు ప్రారబ్ధం సృష్టించే అల్లకల్లోలాలకు మానవ బ్రతుకు ఛిద్రమైపోయింది. అందుకే,

ఛిద్రమైన జీవితాలకు భద్ర నౌకవు రుద్రదేవా!

బరువు బ్రతుకుల బాధల నణచి బోధలు పంచే భువనవంద్య!

అంటూ బాధల సుడిగుండం నుండి బ్రతుకును రక్షించే భద్రనౌక రుద్రదేవుడే నని కీర్తిస్తున్నారు పూజ్య స్వామిజీ.

బ్రతికి నన్నాళ్ళు మనిషికి ఆశే తోడు. ప్రాపంచికమైన ఆశలు ఒకటి మరొక దానికి అంకురార్పణ చేస్తూపోతాయి. ఇవే మనిషిని బంధించే ఆశాపాశాలు. కాని భగవంతుడి మీది ఆశ ఇతర ఆశలను కదలనివ్వదు. ఆశలు తీరిన వాడిగా కాక, ఆశలు లేనివాడి గానే మనిషి సుఖపడగలడు. అటువంటి పూర్ణ సుఖాన్ని భక్తి అందిస్తుంది. భక్తుడికి ఆశ్రయ స్థానం ఆసక్తి స్థానం భగవంతుడే. భక్తుడికి ఉండే ఒకే ఒక ఆశ భగవంతుడితో ఐక్యం కావాలని. చితిని వెలిగించిన కట్టె చితి మంటలను ఎగదోస్తూ శవంతో పాటు చివరికి తాను కూడా కాలి భస్మమైనట్లు, పరమాత్మ మీద ఉండే పరమ ఆశ ఆశ లన్నిటిని తొలగిస్తూ చివరికి తాను కూడా కరిగి అదృశ్యమౌతుంది. అందుకే,

తోడు నీడ నాకు లేదు ఆశ ఒక్కటే నాకు తోడు

సుందరమైన నిన్ను వలచి ఆశ కూడా నన్ను విడిచె

అంటూ, భగవంతుణ్ణి దర్శించాలి అనే భక్తుడి ఏకైక ఆశ ఏకత్వాన్ని దర్శించడంతో అదృశ్యమౌతుంది అంటున్నారు పూజ్య స్వామిజీ. రెండవది ఉన్నప్పుడే ఆశ. ఉన్నదంతా తానే అని తెలిసినప్పుడే ఆశలన్నిటికి సమాధి. అదే అద్వైతానుభూతి, అఖండానందానుభూతి. అదే పరమశివుడు ధరించే విభూతి అంటున్నారు పూజ్య స్వామిజీ.

పుట్టె చేసిన పుణ్యం తాను ఖాళీ కావడమే. వల్లకాటి భాగ్యం తాను శూన్యంగా మిగలడమే. కంఠంలో ప్రాణ మున్నంత వరకు, తలలో మెదడు ఉన్నంత వరకు మనిషిలో ఆలోచనలు కదులుతూనే ఉంటాయి. మనలను పరమాత్మతో కలిపేది, పరమాత్మ

నుండి విడదీసేది సంకల్పమే. జ్ఞాన వృత్తి కలుపుతుంది, అజ్ఞాన వృత్తి విడదీస్తుంది. రెండూ వృత్తులే, సంకల్పాలే. జ్ఞాన అజ్ఞానాలకు విలక్షణంగా, బంధమోక్షాలకు అతీతంగా నిస్సంకల్ప స్థితిలో, నిర్వికల్ప సమాధిలో ధ్యాన శివుడు శోభిస్తూ ఉంటాడు. సంకల్ప సుడిగాలి ఆగినపుడే అంతర్యంలో చైతన్య జ్యోతి దేదీప్యమానంగా ప్రకాశిస్తుంది.

ఊరి పొలిమేరలో, జన సంసర్గానికి దూరంగా వల్లకాటిలో శివుడు నిస్సంగుడై సంచరిస్తుంటాడు. ఏకాంతంలో శయనిస్తాడు. ఆది భిక్షువైన పరమశివుని సేవలో కంచంగా కపాలం, మంచంగా శ్మశానం ధన్యత నొందాయి. 'బుద్ధైతే భగవంతుడు అందరికి ఇచ్చాడు కాని బుద్ధి ఉన్నవారంతా బుద్ధి మంతులు కారు' అనేది పూజ్య గురుదేవుల అందమైన వ్యాఖ్య. బ్రతికి నన్నాళ్ళు మనిషికి బహు వ్యాపకాలు. బ్రతుకుకు ఆధారమై, మరణంలో మనకు ఆలంబనమైన వాడిని క్షణమైనా తలచేందుకు మలినపడిన మనసు అంగీకరించదు. అశుద్ధ బుద్ధి సహకరించదు. అందుకే,

పుట్టె చేసిన పుణ్యమేదో పంచ చేరి కంచమాయె

వల్లకాటి భాగ్యమేదో నీకు తానె మంచమాయె

బుద్ధులున్న నేరమునకా నరుల బ్రతుకు వంచనాయె

అంటూ, శివుడు ఊరును విడిచి వల్లకాటిని వరించడానికి, మరణించిన వారిని కనికరించ డానికి, బ్రతికి ఉన్న నరుల బుద్ధి వైపరీత్యమే కారణ మంటున్నారు పూజ్య స్వామిజీ.

తన నోటి లోని లాలాజలం తోనే శివునికి గూడు కట్టి నీడ నిచ్చింది సాలీడు. తాను స్నానమాడిన నీటినే తొండంతో పట్టి తెచ్చి శివుని అభిషేకించింది ఏనుగు. తన తలపై ఉన్న మణితోనే శివుని అలంకరించింది నాగు. సహజాతాలతో బ్రతికే ప్రాణులే అయినా తలపుతో, పిలుపుతో, వలపుతో పరమాత్మను వశపరచుకో గలిగాయి. ఎన్ని పూజా ద్రవ్యాలను బయట నుండి సమకూర్చుకున్నా 'భక్తి లేని పూజ పత్రి చేటు' అన్నట్లు, ఎన్ని ఉన్నా, 'ఇంకా ఇంకా' అని యాచించడమే కాని అర్చించడం ఎరుగనివాడు మానవు డొక్కడే. అందుకే,

తలచిన లూతకు శుభగతి పిలిచిన హస్తికి సులువది

వలచిన నాగును కనికరించి కొలిచిన మాకు దూరమైతివా!

అంటూ మనసుకు మనసై, ప్రాణానికి ప్రాణమై తన స్వరూపమై వెల్గొందే పరమశివుని సామీప్యాన్ని నరుడు గుర్తించేదెట్లు, అనుభవించే దెపుడు అంటూ దయార్ద్ర హృదయంతో, కరుణ రసంతో పాటను ముగిస్తున్నారు పూజ్య స్వామిజీ.

జై జై గురుదేవ!

మంగళ దీపాలు

ధారావాహిని-23

స్వామి సుందర చైతన్యానంద

కోప రాక్షసి

శ్లో॥ ఉత్తమే క్షణ కోపస్స్యాత్
మధ్యమే ఘటికా ద్వయమ్ ।
అధమే స్యాదహో రాత్రం
పాపిష్ఠే మరణాంతకమ్ ॥

భావము :

ఉత్తముడగు వాని కోపము ఒక క్షణకాల ముంటుంది. మధ్యముని కోపము రెండు ఘటికల వరకు ఉంటుంది. అధముని కోపము రోజంతా ఉంటుంది. పాపాత్ముని కోపము చచ్చేటంత వరకు ఉంటుంది.

వ్యాఖ్య

కోపం మనస్సు యొక్క లక్షణం. ఊహించినది నెరవేరకపోతే కోపం వస్తుంది. అలాగే విరుద్ధమైనది జరిగితే కోపం వస్తుంది. క్రోధం ఒక మాయలమారి. అది ప్రాణాన్ని కూడా హరిస్తుంది.

క్రోధః ప్రాణ హరః

'క్రోధము ప్రాణమును హరించును', అని శ్రీమద్రామాయణము బాలకాండ తెలుపుతుంది.

ఉత్తమునికి కోపం క్షణకాలమే ఉంటుంది. కారణం, అతడు నిత్యవస్తు ప్రాప్తికి యత్నిస్తున్నాడు కనుక అనిత్యమైన మనస్సుతో గొప్పగా సంబంధమును కలిగి ఉండడు. అందుచేత అతని కోపం క్షణంలో అదృశ్య మౌతుంది.

రెండవ కోవకు చెందినవాడు మధ్యముడు. అట్టివాని కోపం రెండు ఘటికల కాలం, అనగా ఇరవై నాలుగు నిముషాల కాలం ఉంటుంది. అతడు మధ్యముడు.

మూడవ కోవకు చెందిన వాడు అధముడు. అతనికి కోపం వస్తే రోజంతా ఉంటుంది. ఒక రాత్రి ఒక పగలు ఉంటుంది. అనగా నిగ్రహశక్తి బాగా కోల్పోయిన వాడు అని అర్థం.

ఇక నాలుగవ కోవకు చెందిన వాడు పాపాత్ముడు. వీడికి కోపము రాకనే ఉండాలి. వస్తే మాత్రము వల్లకాటిలో పోవలసిందే గాని మరొక విధంగా పోయే అవకాశమే లేదు.


కోపం మన స్వభావం కాదు. అదే గనుక మన స్వభావమైతే, మనం పిలిచి నప్పుడల్లా రాగలిగి ఉండాలి. కనుక కోపం మనం ప్రదర్శిస్తున్నామే కాని మనం కోరినప్పుడల్లా కోపం రాదు.

(34వ పేజీ చూడుము)


శ్రీకృష్ణ కథాగానం

ధారావాహిని-4

స్వామి సుందర చైతన్యానంద




(48) అమరావతిలో అలిగెను సురపతి
పిడుగులు రువ్వుచు పోసెను వానలు
ఉరుముల మెరుపుల జడివానలకు
జడిసిపోయిరి గోజనగణము
వినవే మనసా! వినిపించెదను
వీనుల విందుగా వివరముగా ॥ వినవే ॥



(49) అది గని మొర విని మోహనకృష్ణుడు
అభయము నిచ్చి ఆర్తిని బాపి
పుట్టగొడుగు వలె గోవర్ధనమును
ఎత్తి నిలిపెను ఏడు దినములు ॥ వినవే ॥



(50) గర్వములన్నీ గాలికి పోగా
ఇంద్రుడు కొలిచె యాదవచంద్రుని
శ్రీసతి పట్టిన శ్రీకరపద్మము
కొండకు దక్కెను ఏమి పుణ్యమో! ॥ వినవే



(51) అసుర వేళయని తెలియని నందుడు
స్నానము చేసె యమునా జలమున
అది గని దైత్యుడు నందగోపకుని
వరుణుని కడకు గొనిపోయె ॥ వినవే ॥

(52) వాస్తవ మెరిగిన వసుదేవసుతుడు
వెడలెను జనకుని తెచ్చుటకై
మ్రొక్కెను వరుణుడు బ్రోచెను తనయుడు
తెచ్చెను తండ్రిని మెచ్చిరి అందరు ॥ వినవే ॥





(53) రసమయ రూపము రాసమండలము
భువి కేతెంచెను శ్రీవైకుంఠము
గోకులవాడలో రాసక్రీడలో
మునిగినవారి బ్రతుకులు ధన్యము ॥ వి ॥




(54) కలువలు చంద్రుని తలచిన విధము
చెలువలు వలచిరి కృష్ణచంద్రుని
యమునాతటిపై మ్రోగెను మురళి
కాంతలు కదిలిరి విరహము రగిలి ॥ వినవే ॥



(55) వీనుల కమ్మలు ఊగుచు నుండగ
ఏగిరి భామలు యమునాతటికి
శబ్దమార్గమున చరించిరి వనితలు
నందకిశోరుని దర్శించుటకు ॥ వినవే ॥

(56) పాలు పితుకుచు పాలను కాచుచు
పతిసేవలు పరిచర్యలు మాని
పరుగులు పెట్టిరి పరితాపముతో
నిజపతి కడకు చేరిరి కాంతలు ॥ వినవే ॥





(57) అత్తమామలను అవనికి వదలి
పతిసుతులను గాలికి విడిచి
నన్ను చేరుట ధర్మము కాదు
వెనుదిరగండి అనె జగమొండి ॥ వినవే ॥



(58) మనములు కంది మోములు ఎండి
కన్నుల నిండ ధారలు నిండి
కాలివ్రేళ్ళతో నేలను రాయుచు
విధి విధమును గని వగచిరి వనితలు ॥ వి ॥



(59) పరమేశ్వర! ఉపదేశము లాపరా!
సుతులు పతులు సర్వము నీవే!
చాలు చాలు నీ పలుకుల నొల్లము
గొను మా ఉల్లము అనిరి మగువలు ॥ వినవే ॥

(60) యువతుల హృదయము ఎరిగిన సదయుడు
కనికరించెను నిండు మనసుతో
చుక్కల నడుమ చంద్రునివోలె
రాసవిభుడు కరుణించి రమించె ॥ వినవే ॥





(61) అంబికా వనమున సాంబశివుని
భక్తితో కొలిచిరి గోపకులందరు
నిదురించుచుండిన నందుని బట్టి
మ్రింగుచు నుండె భయంకర సర్పము ॥ వి ॥



(62) తన్నెను పాదముతో యదునందనుడు
శాపము పాపము ఆవిరికాగా
వినయశీలుడై విద్యాధరుడు
హరిని సేవించి నిజపురి కేగె ॥ వినవే ॥



(63) చూడామణి గల శంఖచూడుడు
అపహరించెను గోపభామలను
జారుని వధించి జవ్వనుల విడిపించి
మణిని గ్రహించి మన్నన లొందె ॥ వినవే ॥

(సశేషం)

మహిష్మతిలో శంకరయతి

ధారావాహిని-9

స్వామి సుందర చైతన్యానంద

వాద ప్రతివాదములు

మండనమిశ్రుడు మీమాంస మతానికి చెందినవాడు. కనుక అతని వాదము ద్వైతము. శ్రీ శంకరులు వేదాంతి. కనుక ఆయన ప్రతిపాదించునది అద్వైతము. వేదములు ద్వైతపరము అని మండనుని వాదము. అవి అద్వైత పరములని శ్రీ శంకరుల వాదన. ఇరువురు తమ సిద్ధాంతములను ప్రతిపాదించుటలో అనుపమ తర్కమును ఉపయోగించారు. జీవబ్రహ్మల అభిన్నత్వము అసంభవ మని మండనుని పూర్వపక్షము. ఈ అభిన్నత ప్రత్యక్ష, అనుమాన, శ్రుతి ప్రమాణముల మూడిటి వలన బాధితమని అతని అభిప్రాయము.

శ్రీ శంకరులు మండనుని మీమాంసా వాదమును ఖండిస్తారు. గంభీరమైన ధీయుక్తులచే తన సిద్ధాంతమునకు స్థిరత్వమును కల్పించే ప్రయత్నములో మండనమిశ్రుడు విఫల ప్రయత్నం చేశాడు. ఆధారము బలహీనపడుట వలన ఇక చేయునది లేక ప్రతివాదమైన అద్వైతమును ఖండించుటకు ఉద్యమించాడు.

మండన : ఓ యతిరాజా! జీవబ్రహ్మలు స్వరూపతః ఒక్కరే అని మీరు ప్రతిపాదించు విషయమునకు ప్రమాణము మాకు తెలియుట లేదు.

శ్రీ శంకరులు : శ్వేతకేతువు లాంటి శిక్షణ యోగ్యులైన వారికి ఉద్దాలకాది గురువులు ఆత్మ పరమాత్మల అభేదమును ఎరుకపరచి యున్నారు. ఇదియే ప్రమాణము.

'తత్త్వమసి శ్వేతకేతో'

'అభయం వై జనక ప్రాప్తోసి'

'తదాత్మాన మేవావేదహం బ్రహ్మాస్మీతి'

'తస్మాత్తత్సర్వమభవత్'

'తత్ర కోమోహః కః శోక ఏకత్వ మనుపశ్యతః'

మొదలైన వేదవాక్యములు జీవబ్రహ్మైక్య విషయమున ప్రమాణములుగా శోభిస్తున్నాయి.

మండన : 'తత్త్వమసి' మొదలైన వాక్యాలకు ప్రత్యేక అర్థము లేదు. 'హుం ఫట్' మొదలైన వాక్యముల జపము వలన పాపము నశించునట్లు, తత్త్వమస్యాది వాక్యాలను మననం చేస్తే పాప పరిహారమే జరుగుతుంది. వేదవాక్యాలు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని వ్యక్తిని కర్మోన్ముఖునిగా చేసేందుకే ఉన్నాయి. కర్మాచరణకు ఉపకరించని ఏ వేదవాక్యానికీ అర్థమును అన్వేషించ నవసరం లేదు.

శ్రీ శంకరులు : అవును. 'హుం ఫట్' లాంటి వాక్యాలకు జపము నందు తప్ప వేరే విధంగా అర్థం లేదు. రాదు. కానీ, తత్త్వమస్యాది వాక్యాలకు నిర్దిష్టమైన అర్థము గోచరిస్తూ ఉండగా అర్థరహితమైన 'హుం ఫట్' ఇత్యాది వాక్యాలతో మీరు ఎలా పోలుస్తారు?

మండన : ఒకవేళ తత్త్వమస్యాది వాక్యాలకు అర్థమున్నదని అంగీకరించినను అది మీరు అభిప్రాయ పడుతున్న జీవబ్రహ్మైక్యము మాత్రము కాదు. యజ్ఞ యాగాదులను ఆచరించు యజమాని బ్రహ్మము వంటివాడు అని పలుకుట వంటిదే ఈ వాక్యము. కనుక అది విధిశేషమే (కర్మపరమే).

శ్రీ శంకరులు : ఇది చాలా విచిత్రము. వేదము నందలి కర్మకాండ భాగము నందే విధిశేషము లుంటాయి. 'ఆదిత్యుడు యూపము', 'యజమానుడు ప్రస్తరము' మొదలైన వేదవాక్యాలు యజ్ఞయాగాదులకు అంగముగా శోభిస్తున్న యూపము, ప్రస్తరము మొదలైన వానిని ఆదిత్యుడు, యజమానుడు మొదలగు వారి స్వరూపముగా శ్లాఘిస్తూ కర్మకాండలో చేరి యున్నవి. కనుక అవి విధిశేషములు. దానికి భిన్నమైన జ్ఞానకాండ యందు విలసిల్లు 'తత్తమసి' - 'అహం బ్రహ్మాస్మి' వాక్యాలు ఎలా విధిశేషమౌతాయి?

మండన : తత్త్వమస్యాది వాక్యాలు విధిశేషములు కాకుండా కేవలం నిర్వచనములే అయినచో అవి జీవుని కర్మమార్గము నందు ప్రేరేపించ లేనివియై నిస్సారము లవుతాయి. యుక్తమైన దానిని పొందేందుకు, అయుక్తమైన వాటిని విడిచేందుకే శాస్త్రములు. కనుక మోక్ష ఫలమును పొందుటకు ఉపకరించే రీతిలో కర్మ ప్రాధాన్యతను తెలిపినపుడే తత్త్వమస్యాది వాక్యాలకు ప్రయోజనము. అంతేగాని జీవుడు, బ్రహ్మము ఏకమని నిర్ణయించుట తత్త్వమస్యాది వాక్యాల ఉద్దేశ్యము కాదు.

శ్రీ శంకరులు : మోక్షము అనేది క్రియకు ఫలరూపమైనచో అది స్వర్గాదుల వలె నశించి పోతుంది. ఏ ఉపాసన అయినా మానసిక క్రియయే కనుక అది చేయుటకు గాని, చేయకుండా ఉండుటకు గాని, మరొక విధమున చేయుటకు గాని తగియున్నది.

బ్రహ్మవిద్య అనేది జ్ఞానమే కాని ఉపాసన కాదు. అది వస్తు తంత్రమే గాని చోదనా తంత్రము కాదు. కర్మల యొక్క ప్రయోజనము కాదు.

మండన : హే సాధుపురుషా! నీవు భావించినట్లే 'తత్త్వమసి' వాక్యము ఉపాసనా పర్యవసాయి కాకున్నా, ఏకత్వమును నిర్దేశించునది మాత్రము కాదు. జీవునకు బ్రహ్మముతో సామ్యమును చూపునదే గాని జీవబ్రహ్మైక్యమును తెలుపునది కాదు.

శ్రీ శంకరులు : ఇది ఏ విధమైన సామ్యము? 'తత్త్వమసి' వాక్యము చేతన రూపేణ సామ్యమును చూపుచున్నదా? లేక, సర్వజ్ఞత్వ, సర్వశక్తిమత్వాది లక్షణముల చేత సామ్యమును తెలుపుచున్నదా? మొదటి విషయమున చేతనముగా ఉండుట అనే సామ్యము ప్రసిద్ధమై ఉన్నందున ఉపదేశము అర్థరహితము. రెండవ విషయమున జీవునకు సర్వజ్ఞత్వము

ప్రాప్తించుట చేత జీవబ్రహ్మములకు అభేదము సుస్పష్టము. కనుక 'తత్త్వమసి' వాక్యము ఏకత్వమునే ప్రతిపాదించు చున్నది.

మండన : హే యతివరా! జగత్కారణము చేతనముగా ఉండుట చేత, చేతనుడైన జీవునితో సామ్యము చెప్పబడినది అని ఏల గ్రహింపవు?

శ్రీ శంకరులు : అట్లయినచో, ఆ జగత్కారణమును 'అది నీ వంటిది' (త్వత్సదృశమస్తి) అని చెప్పి యుండవచ్చు. 'అదియే నీవు' (తత్త్వమసి) అని చెప్పవలసిన అవసరం ఏమిటి?

మండన : జీవబ్రహ్మల ఐక్యతకు ప్రత్యక్ష జ్ఞానము గాని, అనుమానము గాని లేదు. 'తత్త్వమసి' అను వాక్యముచే జీవబ్రహ్మల ఐక్యత ఎట్లు అంగీకరింప బడుతుంది? ప్రత్యక్షము అభేద వాదమునకు ప్రబల విరోధి. ఎందుల కనగా, 'నేను ఈశ్వరుడను కాను' అని ప్రతి వ్యక్తియూ ప్రతిపాదిస్తున్నాడు.

శ్రీ శంకరులు : ఈ అభిప్రాయము సరిగ లేదు. ఇంద్రియముల ద్వారా జీవబ్రహ్మలలో భేద జ్ఞానము ఎప్పుడూ కలుగదు. ప్రత్యక్షము యొక్క జ్ఞానము విషయేంద్రియముల సన్నికర్షపై ఆధారపడి ఉంటుంది. ఇంద్రియములకు ఈశ్వరునితో ఎన్నడును సన్నికర్ష ముండదు. అప్పుడు విరోధము ప్రసక్తి ఎక్కడున్నది?

మండన : ఓ యతిపురుషా! మీరు ప్రత్యక్షమును ఖండించారు. కాని అనుమానము అభేద శ్రుతిని బాధించు చున్నది. జీవుడు సర్వజ్ఞుడు కాడు. సర్వజ్ఞుడు కాకపోవుట చేత సాధారణ ఘటము బ్రహ్మము కంటే వేరైనట్లుగా జీవుడును బ్రహ్మము కంటెను భిన్నుడే అగుచున్నాడు. ఈ అనుమానము జీవబ్రహ్మల ఐక్యత సిద్ధము గాదని చెప్పుటకు చక్కగా పోలియున్నది.

శ్రీ శంకరులు : జీవబ్రహ్మలలో మీరు నిరూపించు భేదము ఏమిటో, ఎలాంటిదో చెప్పండి. అది పారమార్థికమా? లేక కాల్పనిక మగు అసత్యమా? ఈ భేదము పూర్తిగా సత్యమైనచో మీరు చెప్పిన దృష్టాంతము సరిగ పొసగదు. కాల్పనిక మైనచో దానిని మేమందరము అంగీకరిస్తాము. దానిని నిరూపించుటకు ప్రమాణముల యొక్క అవసర మేమున్నది?

మండన : సరే. మంచిది. నా అనుమానము సరిగ ఉండక పోవచ్చు. కాని, భేద ప్రతిపాదిక శ్రుతులతో 'తత్త్వమసి' వాక్యానికి విరోధము చాలా సుస్పష్టముగా ఉంది. శ్రుతులకు అద్వైత వాదము తాత్పర్యమని ఏ విధముగాను అంగీకరించుటకు వీలుపడదు. ఈ మంత్రమును గూర్చి మీరెన్నడైనా ఆలోచించితిరా?

ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే,
తయో రన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాకశీతి ॥

(ముండకోపనిషత్తు - తృతీయ ముండకము - ప్రథమ ఖండం - ప్రథమ మంత్రం)

జీవుడు కర్మఫల భోక్త. ఈశ్వరునకు కర్మఫలముతో ఎట్టి సంబంధము లేదు. అందువలన ఈ మంత్రము జీవేశ్వరులకు భేదమును సూచించుచున్నది.

శ్రీ శంకరులు : జీవబ్రహ్మల యొక్క ఈ భేద ప్రతిపాదన పూర్తిగా నిష్ప్రయోజనము. ఈ జ్ఞానము వలన స్వర్గప్రాప్తియు లేదు. అపవర్గ ప్రాప్తియు లేదు. పూర్వ నిర్దిష్ట శ్రుతిలో భేదము బుద్ధి, పురుషులకు చూపబడింది. జీవేశ్వరులకు భేదము చూపబడలేదు. కర్మఫలము ననుభవించునది బుద్ధి యని శ్రుతి చెప్పుచున్నది. పురుషుడు దానికంటెను పూర్తిగా భిన్నమైన వాడు. అందుచేత పురుషునకు సుఖదుఃఖముల ననుభవించు ఫలాఫలములు ఎప్పుడును లభింపవు.

మండన : బుద్ధి జడము. అందుచేత మీరు చెప్పే నూతనార్థమును నేను స్వీకరింపను. భోక్త చేతనము కావాలే గాని అచేతనము కాకూడదు. బుద్ధి వంటి జడపదార్థమును భోక్త యని చెప్పుటకు ఏ విద్వాంసుడు సిద్ధపడడు. కనుక జీవేశ్వరుల ఐక్యమును పై శ్రుతి బోధించుట లేదు.

శ్రీ శంకరులు : మీ ఆక్షేపము సరికాదు. పైంగ్య రహస్య బ్రాహ్మణములో బుద్ధి కర్మఫలమును అనుభవించు ననియు, జీవుడు కేవలం సాక్షిమాత్రు డనియు చెప్పబడినది. ఇచ్చట బుద్ధి, జీవుల భేదమును సూచించుటయే జరిగింది.

మండన : సరే, ఆ విషయమును ప్రక్కన ఉంచండి. కఠోపనిషత్తు లోని ఈ క్రింది ప్రసిద్ధ శ్రుతిని గూర్చి విచారించండి.

ఋతం పిబంతౌ సుకృతస్యలోకే గుహాం ప్రవిష్టౌ పరమే పరార్థే।
ఛాయా తపౌ బ్రహ్మవిదో వదన్తి పంచాగ్నయో యే చ త్రిణాచికేతాః॥

నీడ ఎండలలో భేదమున్నట్లు జీవేశ్వరులలో గూడ భేదమును ఈ మంత్రము స్వీకరించు చున్నది.

శ్రీ శంకరులు : మంచిది. కాని ఈ శ్రుతి కూడా అద్వైత సిద్ధాంతమునకు ఎట్టి బాధను కలిగించదు. ఇది లోక-సిద్ధ భేదమును మాత్రము ప్రతిపాదించు చున్నది. లోకములో నిరూపితము గాని అభేద ప్రతిపాదక శ్రుతి నవీనార్థమును వెల్లడి చేయుట అనునది సత్యమే. అందువలన అది మిక్కిలి బలమైనదియే. భేదము ప్రపంచము నందే స్పష్టముగా అగుపిస్తుంది. అందుచేత దానిని నిరూపించుటకు శ్రుతి ఎన్నడూ ప్రయత్నము చేయదు. శ్రుతి ఎప్పుడూ అపూర్వ వస్తు వర్ణనలో నిమగ్నమై ఉంటుంది. ఈ అపూర్వ వస్తువు అభేదమును ప్రతిపాదించునే గాని భేదమును వర్ణించదు.

మండన : ఓ యతివరేణ్యా! నా దృష్టిలో భేద ప్రతిపాదక మగు శ్రుతి బలమైనది. ఏలననగా అది ఇతర ప్రమాణములచే పుష్టి నొందుచున్నది.

శ్రీ శంకరులు : శ్రుతుల బలాబలములను గూర్చి మీరు చక్కగా యోచించలేదు. ఇతర ప్రమాణములచే అర్థము అభివ్యక్త మగుట చేత శ్రుతి చాలా దుర్బలముగా భావింప బడుచున్నది. కనుక అట్టి ప్రమాణములచే ఏ శ్రుతి యైనను పుష్టి నొందినచో అది ప్రబలము కాలేదు.


(26వ పేజీ చూడుము)









ఆశ్రమంలో రామ చైతన్యం










హైదరాబాద్ - సుందర చైతన్యాశ్రమంలో
శ్రీరామాలయ నిర్మాణానికి విరాళములు సమర్పించిన భక్తులు



చి॥ జి.ఆనంద ఈశ్వర చైతన్య
హైదరాబాద్
రూ.6,05,000/-
(ఆరు లక్షల ఐదు వేలు)



శ్రీమతి కె.అరుణ
శ్రీ కె.విజయ్ కుమార్
హైదరాబాద్, రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



డా॥ కె.వి.శేషారెడ్డి
నెల్లూరు
రూ.1,00,000/-
(లక్ష రూపాయలు)



శ్రీమతి కె.ఉమారాణి
శ్రీ కె.రమేశ్
హైదరాబాద్
రూ.65,000/-
(అరవై ఐదు వేలు)



శ్రీమతి ఆర్.పూర్ణ, చి॥ స్వర్ణ పర్ణిక
శ్రీ ఆర్.రాఘవేంద్ర ఫణికుమార్
హైదరాబాద్, రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీ బి.రఘు
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి ఝాన్సీ
శ్రీ కె.వెంకటేశ్వర రావు
నెల్లూరు
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి పి.ఉమారాణి
వైజాగ్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీ ఎమ్.సి.వి.రామకృష్ణ
వైజాగ్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి భవాని
శ్రీ టి.సాయి చైతన్య
వైజాగ్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి ఎమ్.సత్యమ్మ
శ్రీ ఎమ్.వెంకటయ్య
తూప్రాన్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి జి.విమల
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీమతి జి.మోహన
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)



కుమారి డి.హవిశ
హైదరాబాద్
రూ.50,000/-
(యాభై వేలు)



శ్రీ వి.పి.ప్రసాదరావు
హైదరాబాద్
రూ.50,116/-
(యాభై వేల
నూట పదహారు)



శ్రీమతి బి.లక్ష్మి
శ్రీ మోహన్ రెడ్డి
ఆదిలాబాద్, రూ.41,000/-
(నలభై ఒక్క వేలు)



శ్రీ వి.శంకర్
బషీరాబాద్
రూ.40,000/-
(నలభై వేలు)



శ్రీ ఇ.ఎస్.రామచంద్రా రావు
హైదరాబాద్
రూ.30,000/-
(ముప్పై వేలు)



శ్రీ ఎమ్.సుబ్రహ్మణ్యం
హైదరాబాద్
రూ.30,000/-
(ముప్పై వేలు)

(సశేషం)

ఓ కథ చెప్పనా!

స్వామి సుందర చైతన్యానంద

బంగారు బ్రతుకు

ఒక తండ్రికి ఇద్దరు కుమారులు. తండ్రి మరణిస్తూ తన వద్ద ఉన్న పది బంగారు బిస్కెట్లను కుమారు లిరువురికి ఐదేసి చొప్పున పంచి ఇచ్చి కన్ను మూశాడు.



తండ్రి మరణించిన కొంత కాలానికి పెద్ద కుమారుడు సన్యసించి సాధువు అయ్యాడు. చిన్న కుమారుడు గృహస్థుడై, ఒక వ్యాపారాన్ని ప్రారంభించి, ధనార్జన చేసి భార్యాబిడ్డలతో కలిసి జీవిస్తున్నాడు.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. సాధువుగా మారిన జ్యేష్ఠ భ్రాతను చూడాలనే కోరికతో గృహస్థుడైన సోదరుడు అన్నగారి ఆశ్రమానికి వచ్చాడు. సాధు రూపంలో ఉన్న అన్నగారిని దర్శించాడు. రెండు రోజులు ఆశ్రమం లోనే ఆనందంగా గడిపాడు. తిరిగి ఇంటికి వెళ్ళే సమయంలో సాధు మహాత్మునికి నమస్కరించి ఆశీస్సులను అర్థించాడు.

నాయనా! క్షేమంగా ఉన్నావు కదా? అని ప్రశ్నించాడు సాధువు. ఉన్నాను. తండ్రి గారు ఇచ్చి వెళ్ళిన ఐదు బంగారు బిస్కెట్లను పెట్టుబడిగా పెట్టి వ్యాపారం చేశాను. బాగా గడించాను. భగవత్కృప వల్ల ఆ అయిదు బిస్కెట్లు ఇప్పుడు యాభై అయ్యాయి అన్నాడు.

మరి, ఇప్పుడు తృప్తిగా ఉన్నావా? అని ప్రశ్నించాడు సాధువు. లేదు. ఇంకా ప్రయత్నిస్తున్నాను. ఆ యాభై బిస్కెట్లను వంద చేయాలని ప్రయత్నిస్తున్నాను. నా ఆశ ఫలిస్తే, ఇక ఆ తరువాత అంతా తృప్తే అన్నాడు తమ్ముడు.

వెంటనే సాధువు లేచి లోనికి వెళ్ళి కొంతసేపు గదిలో అటు ఇటు వెతికి, దొరికిన ఐదు బంగారు బిస్కెట్లను తెచ్చి వ్యాపారికి ఇచ్చాడు. ఇవీ ఉంచుకో అన్నాడు.

అదేమిటి? మీ అయిదు బంగారు బిస్కెట్లు నా కిచ్చేస్తున్నారు? అంటూ ఆశ్చర్య పోయాడు గృహస్థు డైన సోదరుడు.

ఫరవా లేదులే, తీసుకో! వాటి అవసరం నా కన్నా నీకే ఉంది. నీవు ప్రస్తావించినంత వరకు అవి నా వద్ద ఉన్నాయని కూడా నాకు జ్ఞాపకం లేదు. నువ్వే ఇప్పుడు వాటిని స్మృతికి తెచ్చావు. నీకు వాటి వల్ల తృప్తి కలుగుతుందని అంటున్నావు కనుక, నువ్వే తీసుకో! నేను ఇలాగే తృప్తిగా ఉన్నాను. నా తృప్తి వాటిపై ఆధారపడి లేదు. అన్నాడు సాధువు.

(40వ పేజీ చూడుము)

(20వ పేజీ తరువాయి)

ప్రత్యక్ష, అనుమానాదుల ద్వారా వెల్లడి గాని అర్థమును వెల్లడి చేసినచో అది ప్రబల మగు శ్రుతి. పదార్థముల పరస్పర భిన్నత్వము ప్రపంచములో అంతటా కనిపిస్తున్నది అనే విషయమును మీరు చాలా అభినివేశముతో నిరూపిస్తున్నారు. అందువలన దానిని ప్రతిపాదించు శ్రుతి చాలా దుర్బలమని గ్రహించాలి. అభేద మనేది జగత్తులో ఎక్కడా కనిపించదు. అందుచేత దానిని వర్ణించు శ్రుతి పూర్వము కంటే ప్రబలతరము. ఇట్టి చర్చ వలన 'తత్త్వమసి' యొక్క అభేద ప్రతిపాదనమే శ్రుతి ప్రతిపాద్య విషయముగా వెల్లడి అవుతుంది. అందువలన తత్త్వమసి వాక్యార్థము జీవబ్రహ్మల ఐక్యత లోనే ఉంది. దీనికి ప్రత్యక్షముతో గాని, అనుమానముతో గాని, శ్రుతితో గాని విరోధము లేదు.

ప్రాబల్య మాపాదయతి శ్రుతీనాం మానాంతరం నైవ బుధాగ్రయాయిన్ ।
గతార్థ తాదాన ముఖేన తాసాం దౌర్బల్య సంపాదకమేవ కింతు ॥

హే బుధాగ్రయాయిన్! ఇతర ప్రమాణముల వలన శ్రుతులకు ఎంత మాత్రము బలము చేకూరదు. తెలిసిన విషయమునే తెలుపుట చేత ఆ శ్రుతులకు దుర్బలత్వమునే కలిగిస్తాయి' అన్నారు శ్రీ శంకరులు.

ఇతర ప్రమాణముల చేత వేదము బలపడేది అయినచో వేదము స్వతః ప్రమాణత్వమును కోల్పోతుంది అనేది శ్రీ శంకరుల భావము. మరొక ప్రమాణము ద్వారా అందని దానిని అందించుటయే వేదము యొక్క విశిష్ట ప్రత్యేకత. ఒకవేళ మండనమిశ్రుని వాదనను అంగీకరించే పక్షమున వేదము ఇతర ప్రమాణములను ధ్రువీకరించేది అవుతుందే గాని స్వతః ప్రమాణము కాజాలదు. అదే వాస్తవమైతే వేదము ప్రమాణము కాలేక దుర్బలమై అర్థరహిత మవుతుంది. శ్రీ శంకరాచార్యుల ఈ యుక్తి వాదమును ఆలకించి మండనమిశ్రుడు నిరుత్తరు డయ్యాడు. బ్రహ్మవర్చస్సుతో ప్రకాశించు మండనుని వదనము హిమపాతముచే వాడిపోయిన కమలము లాగా నిస్తేజమైంది. అలౌకిక ప్రతిభా సంపన్నులైన శ్రీ శంకరుల ముందు తన ఓటమిని అంగీకరించవలసి వచ్చింది.

పండిత మండలిలో కలవరము వ్యాపించింది. పండిత లోకానికి మండనభూతు డగు మండనమిశ్రుని ప్రభ ఈ విధంగా కొడిగడుతుందని ఎవ్వరూ స్వప్నంలో కూడా ఊహించలేదు. మీమాంసక మూర్ధన్యుడగు మండనుని ఉన్నత మస్తకము అవనత మగుటను ఆశ్చర్యముతో నిండిన నేత్రములతో చూశారు మహిష్మతీ నగర ప్రజలు. శంకరుల విజయమును మధ్యస్థ యగు ఉభయభారతి అంగీకరించింది.

శ్రీ శంకరుల విజయమును నిర్ణయిస్తూ మధుర సుమ పరిమళాల వంటి ఆమె పలుకులు వెదజల్లబడుతున్నాయి. ఈ లోగా వాదమునకు ముందు ఉభయ భారతి భర్త కంఠము నందు ఉంచిన ప్రసిద్ధ మాల వాడిపోయింది. ఈనాడు శంకర మండను లిరువురిని సన్న్యాసులుగా గుర్తించి భిక్షకు ఆహ్వానించింది.

(సశేషం)

మనీషా పంచకం

మూలం — **శ్రీ ఆదిశంకరాచార్యస్వామి**

అనువాదం — **శ్రీ స్వామీజీ**

శ్లో ॥ సత్యాచార్యస్య గమనే కదాచి న్ముక్తిదాయకమ్
కాశీక్షేత్రం ప్రతి సహ గౌర్యా మార్గే తు శంకరమ్ ।
అన్త్యవేషధరం దృష్ట్వా గచ్ఛ గచ్ఛేతి చాబ్రవీత్
శంకరస్సోఽపి చండాలస్తం పునః ప్రాహ శంకరమ్ ॥ 1

కదాచిత్=ఒకానొకప్పుడు, ముక్తిదాయకమ్=ముక్తిని ప్రసాదించు, కాశీక్షేత్రం ప్రతి=కాశీ క్షేత్రమును గూర్చి, ఆచార్యస్య=శ్రీ శంకరాచార్యస్వామి యొక్క, గమనే= ప్రయాణము, మార్గేతు =మార్గములో, గౌర్యాసహా=గౌరీదేవితో కూడ, అంత్యవేషధరం=చండాలుని వేషమును ధరించిన, శంకరం=ఈశ్వరుని, దృష్ట్వా=చూచి, గచ్ఛగచ్ఛ=పోపో, ఇతి చ=ఇట్లనియు, అబ్రవీత్=పలికెను, చండాలః=చండాలుడైన, సోఽపి=ఆ పరమేశ్వరుడు, పునః=మరల, తం శంకరం=ఆ శంకరాచార్యులను గూర్చి, ప్రాహ=పలికెను.

ఒకానొకప్పుడు ముక్తిదాయకమైన కాశీక్షేత్రము నందు శ్రీ ఆదిశంకరులు నడుస్తూ, మార్గమధ్యమున పార్వతీ సమేతుడై చండాలుని వేషమును ధరించిన పరమ శివుని చూచి, "తొలగిపో - తొలగిపో" అన్నారు. చండాలుని వేషములో నున్న శివుడు శంకరాచార్యులతో ఇలా పలికాడు.

శ్లో ॥ అన్నమయా దన్నమయ మథవా చైతన్యమేవ చైతన్యాత్ ।
యతివర దూరీకర్తుం వాంఛసి కిం బ్రూహి గచ్ఛ గచ్ఛేతి ॥ 2

యతివర=ఓ యతిశ్రేష్ఠుడా!, అన్నమయాత్=అన్నమయమైన దేహము నుండి, అన్నమయం= అన్నమయమైన శరీరమును, దూరీకర్తుం=దూరము చేయుటకు, వాంఛసి=కోరుచున్నావా? అథవా=అటు కానిచో, చైతన్యాత్=చైతన్య స్వరూపమైన ఆత్మ నుండి, చైతన్యమేవ= చైతన్యాత్మను, దూరీకర్తుం=దూరము చేయుటకు, వాంఛసి= కోరుచున్నావా?, కిం=దేనిని, గచ్ఛగచ్ఛ=పోపో (అనుచున్నావు), బ్రూహి=చెప్పుము.

ఓ యతివరేణ్యుడా! నీవు తొలగిపొమ్మని దేనిని కోరుచున్నావో నాకు విస్పష్టంగా చెప్పు. అన్న రూపమైన శరీరమును మరొక అన్నరూప శరీరము నుండి దూరంగా పొమ్మని కోరుచున్నావా? లేక, చైతన్య స్వరూపమైన ఆత్మను మరొక చైతన్యాత్మ నుండి దూరంగా పొమ్మంటున్నావా?

శ్లో ॥ ప్రత్యగ్వస్తుని నిస్తరంగ సహజానందావబోధామ్బుధౌ
విప్రోఽయం శ్వపచోఽయ మిత్యపి మహాన్ కోఽయం విభేద భ్రమః ।
కిం గంగాంబుని బింబితేఽంబరమణౌ చణ్డాల వీధీపయః
పూరే వాంతర మస్తి కాంచనఘటీ మృత్కుంభయో ర్వాంబరే ॥ 3

నిస్తరంగ=అలలు లేని, సహజ=సహజమైన, ఆనంద=ఆనందమును, అవబోధ=జ్ఞానమును, అంబుధౌ=సాగరము నందు, ప్రత్యగ్వస్తుని=ప్రత్యగాత్మ యందు, అయం= ఇతడు, విప్రః= బ్రాహ్మణుడు, అయం=ఇతడు, శ్వపచః=శ్వపచుడు, ఇత్యపి=అని, మహాన్= గొప్పదైన, అయం= ఈ, విభేదభ్రమః=భేదభ్రాంతి, కః=ఎక్కడిది?, గంగాంబుని= గంగాజలము నందు, చండాల వీధీపయః పూరేవా=మురికినీటి గుంట యందు గాని, బింబితే=ప్రతిబింబించిన, అంబరమణౌ =సూర్యుని యందు, అంతరం=భేదము, అస్తికిం =ఉన్నదా?, కాంచనఘటీ= సువర్ణ కలశము యొక్కయు, మృత్కుంభయోః=మట్టికుండ యొక్కయు, అంబరేవా=ఆకాశము నందు గాని, అంతరం అస్తి కిం=భేదమున్నదా?

పరమ పవిత్రమైన గంగాజలము నందు, చండాలుడు వసించే చోట ప్రవహించే మురికినీటి గుంట యందు ప్రతిఫలించిన సూర్యదేవునిలో భేద మున్నదా? అలాగే, బంగారు కలశము నందు, మట్టికుండ యందు ఉండే ఆకాశములో భేద మున్నదా? అలాంటప్పుడు, నిస్తరంగమై, సహజానంద స్వరూపమై, జ్ఞానసాగరమై శోభించు ఆత్మలో ఇతడు బ్రాహ్మణుడు - అతడు చండాలుడు అనే భేద బ్రాంతి ఎక్కడ నుండి వచ్చింది?

శ్రీ శంకర ఉవాచ :

శ్లో॥ జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యా సంవిదుజ్జృంభతే
యా బ్రహ్మాది పిపీలికాన్త తనుషు ప్రోతా జగత్సాక్షిణీ ।
సైవాహం న చ దృశ్యవస్త్వితి దృఢ ప్రజ్ఞాస్తి యస్యాపి చేత్
చణ్డాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురు రిత్యేషా మనీషా మమ ॥ 1

యా సంవిత్=ఏ ఆత్మజ్ఞానము, జాగ్రత్స్వప్న సుషుప్తిషు=జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థల యందు, స్ఫుటతరా=స్పష్టముగా, ఉజ్జృంభతే=మిక్కిలి ప్రకాశించు చున్నదో, యా=ఏ ఆత్మచైతన్యము, బ్రహ్మాది పిపీలికాంత=బ్రహ్మ మొదలు చీమ వరకు గల, తనుషు =శరీరముల యందు, ప్రోతా=అనుస్యూతమై, జగత్సాక్షిణీ=జగత్తునకు సాక్షియై, సైవ= ఆ చైతన్యమే, అహం=నేను, దృశ్యవస్తు=దృశ్యవస్తువు, న చ=కాను, ఇతి=అని, దృఢ ప్రజ్ఞా= దృఢమైన జ్ఞానము, హి =నిశ్చయముగా, యస్య=ఎవనికి, అస్తిచేత్=ఉన్నదో, స తు=అతడు, చండాలోఽస్తు= చండాలుడే అగు గాక!, ద్విజోఽస్తు=ద్విజుడే అగు గాక!, మమ=నాకు, గురురితి=గురువు అని, ఏషా మనీషా=నా నిశ్చితాభిప్రాయము.

శ్రీశంకరులు పలికిరి : ***ఏ ఆత్మచైతన్యము జాగ్రత్స్వప్న సుషుప్తుల యందు స్ఫురద్రూపమై ప్రకాశించు చున్నదో, ఏ చైతన్యాత్మ బ్రహ్మ మొదలు చీమ వరకు గల శరీరముల యందు అనుస్యూతమై జగత్సాక్షిగా జాజ్వల్యమాన మగుచున్నదో, అట్టి చైతన్యమే నేను గాని, గోచరించే***

దృశ్యవస్తువును గాను. ఈ విధమైన నిశ్చయ జ్ఞానము ఎవరికి గలదో, అట్టి జ్ఞాన స్వరూపుడు చండాలు డైనను, ద్విజు డైనను నాకు ఆచార్యుడే. ఇదే గురువు విషయంలో నా నిశ్చితాభిప్రాయము.

శ్లో॥ బ్రహ్మైవాహ మిదం జగచ్చ సకలం చిన్మాత్ర విస్తారితం
సర్వం చైత దవిద్యయా త్రిగుణయా శేషం మయా కల్పితమ్ ।
ఇత్థం యస్య దృఢామతి స్సుఖతరే నిత్యే పరే నిర్మలే
చణ్డాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురురిత్యేషా మనీషా మమ ॥ 2

సర్వం చ ఏతత్=సమస్తమైన ఈ ప్రపంచము, త్రిగుణయా=త్రిగుణములు గల, అవిద్యయా= అవిద్య చేత, మయా=నా చేత, కల్పితం=కల్పింప బడినది, ఇదం=ఈ, సకలం=సమస్తమైన, జగచ్చ=ప్రపంచమును, చిన్మాత్ర=చైతన్యము చేత, విస్తారితం=వ్యాపించి నదియై, అహం= నేను, బ్రహ్మైవ=బ్రహ్మమునే, ఇత్థం=ఈవిధంగా, యస్య=ఎవనికి, సుఖతరే=మిక్కిలి సుఖరూపమైన, నిత్యే=నిత్యమైన, నిర్మలే=నిర్మలమైన, పరే=పరబ్రహ్మము నందు, దృఢామతిః =దృఢమైన బుద్ధి కలదో, సతు=అతడు, చండాలోఽస్తు=చండాలుడే అగు గాక, ద్విజోఽస్తు=బ్రాహ్మణుడే అగు గాక!, మమ=నాకు, గురురితి=గురువు అని, ఏషా మనీషా=నా నిశ్చితాభిప్రాయము.

నేను, చైతన్యముచే విస్తారితమై యున్న ఈ సమస్త ప్రపంచము బ్రహ్మమే. ఈ దృశ్యమాన జగత్తు, త్రిగుణ మిళితమైన అవిద్య చేత నాచే కల్పించబడింది, ఈ విధంగా ఎవరి బుద్ధి సుఖ స్వరూపమైన, నిత్యమైన, నిర్మలమైన పరబ్రహ్మము నందు దృఢమై యున్నదో, అట్టి జ్ఞాన స్వరూపుడు చండాలు డైనను, ద్విజుడైనను నాకు ఆచార్యుడే. ఇదే గురువు విషయంలో నా నిశ్చితాభిప్రాయము.

శ్లో॥ శశ్వన్నశ్వర మేవ విశ్వమఖిలం నిశ్చిత్య వాచాగురో
ర్నిత్యం బ్రహ్మ నిరన్తరం విమృశతా నిర్వ్యాజ శాన్తాత్మనా ।
భూతం భావి చ దుష్కృతం ప్రదహతా సంవిన్మయే పావకే
ప్రారబ్ధాయ సమర్పితం స్వవపు రిత్యేషా మనీషా మమ ॥ 3

అఖిలం విశ్వం=సమస్తమైన జగత్తు, శశ్వత్=ఎప్పుడు, నశ్వరం ఏవ= నశించిన దాని వలె, నిశ్చిత్య బ్రహ్మ=నిత్యమైన పరబ్రహ్మమును గూర్చి, నిరంతరం =ఎల్లప్పుడు, విమృశతా= విచారము చేయునట్టి వాడు, నిర్వ్యాజ=వాసనలు లేని, శాంతాత్మనా =శాంతించిన మనస్సు గలవాడు, భూతం=గతంలో ఆచరింప బడినది, భావిచ=మున్ముందు రాబోవు నదియు, దుష్కృతం=దుష్కర్మను, సంవిన్మయే=జ్ఞానరూపమైన, పావకే=అగ్ని యందు, ప్రదహతా= దహించిన వాడును, స్వవపుః=తన శరీరము, ప్రారబ్ధాయ=ప్రారబ్ధానుభవము కొరకు,

సమర్పితం=అర్పించ బడినది, ఇతి=అని, మమ=నాయొక్క, ఏషా మనీషా=నిశ్చిత మైన అభిప్రాయము.

ఈ దృశ్యమాన జగత్తు సర్వము నాశవంత మైనదని గురుబోధ ద్వారా గ్రహించి, శమించిన మనస్సుతో సదా పరబ్రహ్మమునే విచారణ చేయువాడు, జ్ఞానాగ్ని యందు సంచిత ఆగామి కర్మలను దగ్ధ మొనర్చిన వాడు, తన దేహమును ప్రారబ్ధ కర్మానుభవమునకు అర్పించిన వాడు నా గురువే యని నా అభిప్రాయము.

శ్లో ॥ తిర్యఙ్నరదేవతాభి రహమిత్యన్తః స్ఫుటాగృహ్యతే
యద్భాసా హృదయాక్ష దేహ విషయా భాన్తి స్వతోఽచేతనాః ।
తాం భాస్యైః పిహితార్క మణ్డల నిభాం స్ఫూర్తిం సదా భావయ
న్యోగీ నిర్వృత మానసో హి గురురిత్యేషా మనీషా మమ ॥ 4

తిర్యక్=జంతువులు, నర=మనుష్యులు, దేవతాభిః=దేవతల చేతను, అంతః=అంతర్యమున, అహమితి=నేను అని, యా=ఏ జ్ఞానము, స్ఫుటా=స్పష్టముగా, గృహ్యతే=గ్రహింప బడుచున్నదో, యద్భాసా=ఏ ప్రకాశము చేత, హృదయ=హృదయమునకు, అక్ష=నేత్రాది ఇంద్రియములకు, దేహ=శరీరమునకు, విషయాః=గోచరమగు విషయ వ్యాపారములు, స్వతః=స్వయముగా, చేతనా=చైతన్యము గలవియై, భాంతి=భాసించు చున్నవో, తాం=ఆ చైతన్యమును, భాస్యైః =ప్రకాశింప చేయుటకు, పిహిత=కప్పబడిన, అర్కమండల=సూర్యమండలముతో, నిభాం= సమానమైన, స్ఫూర్తిం=స్పురణ గాను, సదా=ఎల్లప్పుడు, భావయన్=భావించు నట్టి, యోగీ= యోగి, నిర్వ్ృతమానసోహి=సంతుష్టాంతరంగ చిత్తుడు కదా!, సః=అతడే, మమ=నాకు, గురురితి=గురువు అని, ఏషా మనీషా=నా నిశ్చితాభిప్రాయము.

పశుపక్ష్యాదులు, నరులు, దేవతల అంతర్యములలో 'నేను' అనే ఏ జ్ఞానము విస్పష్టముగా చూడబడు చున్నదో, ఏ ఆత్మచైతన్యము వలన మనస్సు, ఇంద్రియములు, దేహము స్వయముగా చైతన్యము కలిగి యున్నట్లు శోభించు చున్నవో, ఏ బ్రహ్మ చైతన్యము సూర్యమండలమును కప్పియున్న మేఘమండలమును ప్రకాశింప చేయు భానుని తేజస్సుతో సమానముగా తేజరిల్లు చున్నదో, అట్టి ఆత్మను చింతనము చేయు యోగి సంతుష్ట చిత్తుడు కదా! అట్టి మహాత్ముడే నా గురువు అని నా నిశ్చితాభిప్రాయము.

శ్లో ॥ యత్సౌఖ్యాంబుధి లేశ లేశత ఇమే శక్రాదయో నిర్వృతా
యచ్చిత్తే నితరాం ప్రశాన్తకలనే లబ్ధ్వా మునిర్నిర్వృతః ।
యస్మిన్నిత్య సుధామ్బుధౌ గలిత ధీ బ్రహ్మైవ న బ్రహ్మవిద్
యః కశ్చిత్స సురేన్ద్ర వన్దిత పదో నూనం మనీషా మమ ॥ 5


యత్=ఏ, సౌఖ్యాంబుధి=సుఖసాగరము నందలి, లేశలేశతః=కణము లోని ఒకానొక కణము వలన, ఇమే=ఈ, శక్రాదయః=ఇంద్రాది దేవతలు, నిర్వృతాః=ఆనందించు చున్నారో, నితరాం=మిక్కిలి, ప్రశాంతకలనే=ఉపశమించిన సంకల్పములు గల, యచ్చిత్తే=ఏ చిత్తము నందు, లబ్ధ్వా=పొంది, మునిః=మననశీలుడు, నిర్వృతః= నిత్య సుఖమును పొందు చున్నాడో, యః కశ్చిత్= ఏ ఒకానొకడు, గళితధీః=విగలిత మగు బుద్ధి గలవాడై, యస్మిన్=ఏ, నిత్య సుధాంబుధౌ=నిత్యమైన సుఖసాగరము నందు, గళితధీః=నిమగ్నమైన చిత్తము గలవాడై, సః =అట్టివాడు, బ్రహ్మవిత్=బ్రహ్మమును తెలిసికొనిన వాడు, న=కాదు, బ్రహ్మైవ=బ్రహ్మమే, సురేంద్ర=ఇంద్రునిచే, వందిత పదః=మ్రొక్కబడిన చరణములు గలవాడు, నూనం= నిశ్చయముగా, మమ మనీషా=నా నిశ్చితాభిప్రాయము.

ఏ సుఖ సాగరము నందలి బిందులేశము చేత ఇంద్రాది దేవతలు ఆనందమును పొందుచున్నారో, మిక్కిలి ఉపశమించిన వృత్తులు గల చిత్తము నందు దేనిని పొంది మనన శీలుడు ఆనందితు డగుచున్నాడో, ఏ సుఖ సాగరమున చిత్తము లయించి పోవుట చేత ఎవడు తాను బ్రహ్మవేత్త గాక బ్రహ్మమే అగుచున్నాడో, అట్టివాని దివ్యమైన చరణ కమలములను దేవేంద్రుడు అర్చించు చున్నాడు. అట్టి దివ్యాత్ముడే నా గురువు అని నా నిశ్చితాభిప్రాయము.

సంతాపము




శ్రీమతి బి.శ్యామల
సుందర సత్సంగ్
సికింద్రాబాద్



శ్రీ భక్తేశ్వర్
సుందర సత్సంగ్
నల్లకుంట, హైదరాబాద్

❋భయ మెందుకు?❋

స్వామి సుందర చైతన్యానంద



ద్వైతంలో ఏదైనా జరగవచ్చు. ఆశ్చర్యం లేదు. శివుణ్ణి భయ పెడుతూ భస్మాసురుడు వెంట బడ్డాడు. తానే భయపడి అర్జునుడు కూలబడ్డాడు. అంతా ద్వైత నాటకమే.

మనస్సు ఎక్కడుంది? అనేది ముఖ్యం కాదు. మనస్సులో ఏముంది? అనేది ప్రధానం. మనస్సులో ప్రపంచం ఉంటే, ప్రపంచం లోనే మనసు తిరుగుతుంది. మనస్సులో పరమాత్మ ఉంటే, మనస్సు పరమాత్మ సన్నిధి లోనే ఉంటుంది.

నీకు మనసుంది. నీ మనసును చలింప చేసే శక్తి వాస్తవంగా ఈ ప్రపంచంలో దేనికీ లేదు. సమస్య లంటావా? అవి ఉంటాయి. అవి ఉండేది నీవు భయపడటానికి కాదు. అర్థం చేసుకోవటానికి. అర్థం చేసుకొని వాటిని ఎదుర్కోటానికి. వాటిని తప్పించు కోవాలని నీవు ప్రయత్నిస్తే, నిన్ను అవి వెంబడిస్తూ వేధిస్తాయి. బాధిస్తాయి. జీవితాంతం కలత పెడతాయి.

భయపడకు. భయపడ వలసినంత బలహీనుడవు నీవు కావు. నీవు ఎంతో శక్తి మంతుడవు. నీ లోని శక్తిని బహిర్గతం చేసేందుకు నువ్వు సిద్ధంగా ఉండు. నీ లోని బలహీనత నీ దేహానికి సంబంధించింది కాదు. నీ ఆలోచనకు సంబంధించింది. నీవు బలహీనుడ వని నీవు భావిస్తావు. అందుచేత భీతి చెందుతావు. ఇక్కడే నీవు బలహీనుడ వవుతావు.

భయపడటానికి ఏదో కారణ ముంటుంది. అలా ఒక నిమిత్తం వల్ల ఏర్పడేదే భయం. బిభే త్యస్మాదితి భయం - 'దీని వలన భయపడతారు' అని భయాన్ని నిర్వచించాడు అమరసింహుడు. పారమార్థికంగా భయ కారణము ద్వైతమే నని నిర్ధారణ చేసింది ఉపనిషత్తు.

యదాహ్యే వైష ఏతస్మిన్నుదర మంతరం కురుతే, అథ తస్య భయం భవతి - ఎప్పుడొకనికి తాను వేరనియు, ఆత్మ వేరనియు భేద బుద్ధి కలుగుచున్నదో అప్పుడతనికి భయము కలుగుచున్నది అన్నది ఉపనిషత్తు.

భయము అనేక రూపాలలో కనిపిస్తుంది. కొందరు తేళ్ళను, పాములను చూచి భయపడతారు. కొందరు శత్రువులకు భయ పడతారు. పండితులు వాదించే వారిని చూచి భయ పడతారు. తమను విమర్శించే వారిని చూచి కొందరు భయ పడతారు. ధనికులు దొంగలకు భయ పడతారు. కొందరు వ్యాధులకు భయ పడతారు. అలా భయ పెట్టేందుకు వచ్చిందే కరోనా.

నశించే దేహముతో తాదాత్మ్యాన్ని త్యజించాలి. దేహము యొక్క మనుగడకు

ఆధార మైన ఆత్మను గూర్చి సదా చింతించాలి. ఇదే జరిగితే, భయము పారి పోతుంది. భేదమే భయానికి కారణము (ద్వితీయాద్వై భయం భవతి). మనిషికి భయం ఎందుకు కలుగుతూ ఉంది?

ఏదైనా, ఎప్పుడైనా తెలియ నపుడే భయం ఉంటుంది. చీకటిలో మనిషి ఎందుకు భయ పడతాడు? ఏదీ కనిపించదు కనుక. ఏదీ అర్థం కాదు కనుక. బాహ్యంలో వెలుతురు ఉంటే భయం ఎలా ఉండదో, విషయము సుస్పష్టంగా అర్థమైతే, ఆంతర్యంలో, అంటే బుద్ధిలో చీకటి ఉండదు కనుక, భయం ఉండదు.

జీవితంలో ఏర్పడే భయాలలో అతి ప్రధానమైంది మృత్యు భయం. మనిషికి మరణ భయం ఎందుకు కలుగుతూ ఉంది? ప్రస్తుతం లేని మరణం భవిష్యత్తులో రాబోతుంది అనేది భయ కారణమా? లేక ప్రస్తుతం ఉన్న తాను భవిష్యత్తులో లేకుండా పోతాడేమో అనేది భయహేతువా?

పుట్టేది ఏదయినా గిట్టేందుకే; జ్ఞానం తప్ప. పుట్టేది ఏదైనా గిట్టేదే అయినపుడు, పుట్టిన దేహము కూడా ఎప్పుడైనా, ఎలాగైనా గిట్టేదే. మరణ ధర్మం గల దేహం విషయంలో మనిషికి దిగు లెందుకు? భయ మెందుకు?

చావడానికి పుట్టిన దేహం చచ్చి తీరుతుంది. పుట్టుక తెలియని దేహి లేదా ఆత్మ ఎప్పుడూ చావదు. చచ్చే దేహాన్ని గూర్చి దుఃఖించడానికి తాను దేహం కాదు. తానైన ఆత్మను గూర్చి దుఃఖించడానికి ఆత్మకు మరణం లేదు. ఇక దుఃఖం దేనికి? ఎందుకు భయం? అర్థమైందా? నీకు అర్థమైతే, ఈ సత్యాన్ని కరోనాకు కూడా చెప్పు. అది వింటే విననీ; వినక పోతే ఎక్కడైనా దూకి చావనీ. నీవు మాత్రం భయం లేకుండా ఉండు. నిర్భయంగా ఉండు. అభయరూపు డనిపించుకో. అభయం అంటే ఏదో కాదు; భయం లేకపోవడమే (అభయం అభీరుతా). ఇంతకీ ఏది భయం? ఏది అభయం? భయం అనేది వ్యక్తి మనస్సు లోని ప్రతిచర్య (రియాక్షన్). ప్రతిస్పందన. అంతేగాని, భయ మనేది ప్రత్యేకంగా ఒకటి లేదు. దుఃఖానికి కారణమైన దానిని చూడటం వల్ల కలిగే బాధయే భయం. అది లేక పోవటమే అభయము. భగవంతుడు అభయ రూపుడు. అందుచేత భక్తులు కూడా అభయ స్థితి లోనే ఉండాలి. ఎలా జీవిస్తామో, ఏమౌతామో అనే భయం తెలియని వారు భక్తులు. ఇంతకాలం ఎవరి అనుగ్రహ ప్రసాదంతో జీవించామో, భవిష్యత్తులో కూడా ఆ కరుణా ఛత్రము క్రిందే జీవిస్తాము. ఎలా జీవిస్తామో అనే భయం ఎందుకొస్తుంది?

చీమలు బ్రతుకు తున్నాయి. దోమలు బ్రతుకు తున్నాయి. చేపలు ఈదుతూ బ్రతుకు తున్నాయి. గువ్వలు ఎగురుతూ బ్రతుకు తున్నాయి. అన్నిటిని బ్రతికించే వాడు మన బ్రతుకును చూసుకోడా? ఇదే అభయం. భక్తులకు తరగని ఐశ్వర్యము. ఇక, భయ మెందుకు?

యస్మా న్నో ద్విజతే లోకో లోకా న్నో ద్విజతే చయః ।
హర్షా మర్ష భయో న్ముక్తః స జీవన్ముక్తః ఉచ్యతే ॥

'ఎవరి వలన లోకానికి భయము లేదో, ఎవడు లోకము వలన భయమును పొందడో,

ఎవడు హర్ష శోకాది ద్వంద్వములు లేక యుండునో, వాడే జీవన్ముక్తుడు' అన్నది ఉపనిషత్తు. చచ్చే కరోనా జీవన్ముక్తుని ఏం చేస్తుంది? భయ మెందుకు? భయమునకు వ్యతిరిక్త మైనది అభయము. అభయ కారణము అద్వైతము కనుక, అది శివ స్వరూపము. భగవ ద్విభూతి. అధర్మపరులకు భయ హేతువైన భగవంతుడు, ధర్మపరులకు, భక్తులకు అభయ రూపుడు. సంసార భయమును పోగొట్టేవాడు భగవంతుడు. ఇక, కరోనా భయం భక్తులకు ఉంటుందా? ప్రపంచం ధర్మాలతో నడుస్తూ ఉంది. నియతితో కొనసాగుతూ ఉంది. ఇక్కడ ఎప్పుడు ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. అలా జరగడం వెనుక కారణా లున్నాయి. కారణా లుండి జరిగే టప్పుడు అవి అనివార్యాలే గాని అసంభవాలు కావు. అసంభవా లైతే ఎందుకు జరుగుతాయి? వీటన్నిటి వెనుక, జ్ఞానస్వరూపుడు, ప్రేమమయుడు అయిన పరమేశ్వరుడే ఉన్నాడనే సత్యం అర్థమైతే, భక్తులైన వారికి భయాలు దూర మవుతాయి. అభయమే ఐశ్వర్యంగా ఉంటుంది. అర్థమైందా? అయితే, ఇక భయ మెందుకు?

ప్రియాప్రియ వియోగ సంయోగ రూపమైన దుఃఖానికి కారణమైన వాటిని వీక్షించడం చేత సంభవించే విషాదమే భయాన్ని కలిగిస్తుంది. ప్రియ మైనది పోతుందేమో, అప్రియ మైనది పోదేమో, లేక వస్తుందేమో అనే ఆలోచనే దుఃఖానికి, తద్వారా భయానికి కారణ మవుతూ ఉంది. దీని నుండి విడి పడటమే అభయము. అది దైవీసంపద.

ప్రియాప్రియా లనేవి మనం సృష్టించు కున్నవి. ఏది మనకు ప్రాప్తించినా, అది ఈశ్వర ప్రసాదమని మనకు అర్థమైతే, ఏది వచ్చినా అది ప్రియం గానే ఉంటుంది (**ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి**). ప్రియమైనది దుఃఖాన్ని కలిగించదు. దుఃఖము లేనపుడు భయం ఉండదు. భయం లేని స్థితి అభయమే కదా! అభయ రూపుడైన భగవంతునితో నిత్య సంబంధాన్ని ఏర్పరచు కోవడం వల్ల భయాలు దూర మౌతాయి. అభయం అనుగ్రహించ బడుతుంది. ఇక భయ మెందుకు?

తేనైవ బ్రహ్మ భావేన పరమానంద మశ్నుతే ।
'బ్రహ్మ భావన చేత జీవుడు పరమానందమును అనుభవిస్తున్నాడు' అన్నది ఉపనిషత్తు.

(12వ పేజీ తరువాయి)


కోపం పాపాన్ని తెచ్చి పెడుతుంది. శాపాలను పంచి పెడుతుంది. శత్రువులను సృష్టిస్తుంది. పరిస్థితులను పాడు చేస్తుంది. మనస్సును మలిన పరుస్తుంది.

కోపాన్ని ప్రేమతో జయించాలి. ఏ వ్యక్తిపై మనకు కోపమొస్తుందో అతడు శ్యామ సుందరుడే అని భావించాలి. ప్రేమ నిండిన హృదయంలో క్రోధాగ్నులు రగుల్కొనలేవు. కోపం అజ్ఞాని పాలిటి శాపం. జ్ఞానులు కోపాన్ని ప్రదర్శిస్తారు. కానీ హృదయంలో ప్రేమనే కలిగి ఉంటారు.

- సమాప్తం -

గురు హృదయం

స్వామి సుందర చైతన్యానంద



కుండను నదిలో ముంచి పైకి తీస్తే, కుండ నిండలే దనుకుందాం. ఎక్కడో దోష ముందని అర్థం. ఆశ్రమం లోనే ఉంటూ మనం ఆనందంగా ఉండలేకపోతే, ఎక్కడో లోప ముందని అర్థం. లోపాలు, దోషాలు జీవితంలో ఉండటం అవరోధాలే కావచ్చు. కాని, అనివార్యాలు మాత్రం కావు. కాకపోతే, ఈ ప్రతిబంధకాలను ప్రయత్నంతో తొలగించుకోలేకపోతే మాత్రం జీవితం చాలా దురదృష్ట కరంగా మారి పోతుంది. మొగ్గలు వికసించక పోయినా, మేఘాలు వర్షించక పోయినా పెద్దగా ఆలోచించ నవసరం లేదు. కాని, మనోబుద్ధు లున్నటు వంటి మానవుడు గనుక ప్రతిఫలాన్ని అందుకోలేక పోతే, ఆచరణలో అన్నా లోపముండాలి. లేదా, అవగాహనలో నన్నా దోష ముండాలి. గురుసన్నిధిలో ఆశ్రమ జీవనాన్ని సాగించే శిష్యులు ఈ విషయాన్ని ఆలోచించుకొంటూ అంతరేక్షణతో జీవించాలి.

గురువు చెప్పిన దానిని ఆచరించాలి. గురువు ఆజ్ఞను ధిక్కరించ కూడదు. చెప్పింది గురుదేవుని మనస్సు. చెప్పింది చేయకుండా దానిని ధిక్కరిస్తే, అలా ధిక్కరించిన శిష్యునికి ఉండేది కూడా మనస్సే. గురువు మనసు చెప్పిన విషయాన్ని శిష్యుని మనస్సు ఆచరించడానికి ఎందుకు సంశయిస్తూ ఉంది? ఇద్దరివీ మనస్సులే కదా! మరి, ఆ మనస్సులలో ఉండే భేద మేమిటి? ఏమీ లేదు. మనస్సులు ఒక్కటే అయినా, మనస్సుల లోని భావాలు ఒకే విధంగా లేవు. ఇదే ఇద్దరి మధ్య అగాధం.


గురుదేవుడు ఏది ఆలోచించినా రాగద్వేషాలు లేకుండా, ధర్మబద్ధంగా ఆలోచిస్తాడు. అందుకని, తన సంకల్పాలతో తాను సంతృప్తిగా ఉంటాడు. అదే శిష్యునిలో లోపించి ఉంటుంది.

ఋషే ర్హృదయం ఋషి రేవ వేత్తి - గురువు హృదయాన్ని గురువే అర్థం చేసుకో గలడు. గురు హృదయం శిష్యునికి అర్థం కావడం అనుకున్నంత సులభం కాదు.

శిష్యుడు రాగద్వేషాలకు అతీతుడుగా, లేదా రాగద్వేషాలను తటస్థ పరచి జీవించ గలిగితే, గుర్వాజ్ఞ విషయంలో ఘర్షణ ఉండదు.

నౌమి సుందర స్వామినమ్

శ్రీ కొమ్మినేని వెంకట రామయ్య
గుంటూరు



బ్రహ్మ విద్యా ప్రదాతారం
జ్ఞాన బ్రహ్మేతి కీర్తితమ్ ।
బహు భాషా విశేషజ్ఞం
నౌమి సుందర స్వామినమ్ ॥ నౌమి ॥ 1


జ్ఞాన యజ్ఞ ప్రభావజ్ఞం
ధ్యాన గోష్ఠీ విరాజితమ్ ।
సర్వజ్ఞం సర్వ ధర్మజ్ఞం
సచ్చిదానంద శోభితమ్ ॥ నౌమి ॥ 2



వాసుదేవ ప్రసాదేన
ఆత్మ శక్త్యా ప్రకాశినమ్ ।
"గిరిధారీ"తి నామ్నావై
భక్తానాం హృదయే స్థితమ్ ॥ నౌమి ॥ 3

గానప్రియం గానలోలం
భజనాసక్త మానసమ్ ।
గీతా ప్రవచనే దక్షం
భవ్య భాగవతార్థదమ్ ॥ నౌమి ॥ 4

రామాయణ కథాసక్తం
కృష్ణ ధ్యాన పరాయణమ్ ।
భావజ్ఞం త్యాగినం భవ్యం
తాత్త్వికార్థాభి వర్దినమ్ ॥ నౌమి ॥ 5




తరణతారణ గుణోపేతం
సమతా భావ పోషకమ్ ।
ఆర్షధర్మ ప్రవక్తారం
అతులానంద దాయినమ్ ॥ నౌమి ॥ 6

వాడని పూలు

స్వామి సుందర చైతన్యానంద

మహాత్ముల లోని గొప్పతనమే మనం వారిని ప్రేమించేలా చేస్తుంది. కనుక, మహాత్ముల్ని ఎవ్వరైనా ప్రేమించ గలరు.

కానీ, పాపిని ప్రేమించడం వెనుక ఉండేది మన గొప్పతనమే. మనం గొప్పవాళ్ళం కాలేకపోతే చిన్నవారిని ప్రేమించ లేము. చిన్న వారికి పెద్ద అర్హత లుండవు. పెద్ద మనసు గలవారు ప్రేమించి నపుడు చిన్నవారు కూడా పెద్ద వారైనట్లు తృప్తి చెందుతారు. ఇక్కడే తరతమ భేదాలు అంతరిస్తాయి. ఈ పని చేసేందుకే **వేదాంతం** నిలిచి ఉంది. మనలో తప్పులు లేవా? దోషాలు లేవా? స్వార్థం లేదా? తొందరపాటు లేదా? కాఠిన్యం లేదా? కపటము లేదా? పరిశీలించి చూస్తే ఉన్నవన్నీ అవే నేమో! అలాగని మనల్ని మనం ద్వేషించు కుంటున్నామా? మనల్ని మనం ప్రేమించుకోవడం మానేస్తున్నామా? ఇతరులు మన లాంటివారు కారా? దీనిని వంట పట్టించుకొని సహన భావం ఏర్పరచు కుంటే అందరినీ అవ్యాజంగా ప్రేమించగలం. ఈ ప్రేమను నేర్పేందుకే **వేదాంతం**



శోభిస్తోంది. నిన్ను, నన్ను, అందరినీ పరమాత్మ నిర్వ్యాజంగా ప్రేమించడం లేదా? మనలో ఏమి చూసి పరమాత్మ మనల్ని ప్రేమిస్తున్నాడు? కారణాలను వెదికితే మనకు పట్టెడన్నం కూడా పెట్టడు అనేది అక్షర సత్యం. దోసెడు నీళ్ళు కూడా పోయడు అనేది అక్షరాలా సత్యం.

పూచిన మల్లెలపై వీచిన గాలులు సౌరభాన్ని దోచుకుంటాయి. దాచుకొంటాయి. ఎందుకో తెలుసా? నీకు దానం చేసేందుకు.
మనసులో భావ మొగ్గలు విరబూయాలి. ప్రేమగాలులు జ్ఞాన సౌరభాన్ని వెద జల్లాలి. మనసులో మల్లెలు పూసేది, వెన్నెల కాసేది అప్పుడే.

Man is a saint when inspired and a criminal when compelled.

'భవ్యమైన ప్రేరణ లభించి నపుడు మనిషి మహాత్ముడు కావచ్చు. ప్రతికూల వాతావరణంలో పాపి కావచ్చు', అన్నారు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్.

ఇది గాలిబ్రతుకు.

ఎన్నాళ్ళు తోడున్నా, జాలి లేకుండా మోసం చేసేదే గాలి.

ప్రేమలో కపట ముండదు. కపట మెరుగని ప్రేమ కల్ల లాడదు.

దీపం కాంతికి దూరం కాదు. చంద్రుడు చంద్రికను విడిచిపోడు. సూర్యుడు వెలుగుకు వేరు కాడు. మనం ప్రేమను మానలేము.

ఇది సత్యం...... ఇదే దైవం..... ఇదే జ్ఞానం.

భోజన కాలంలో ఆపోశన పట్టే సమయాన సర్వ ప్రాణుల నుద్దేశించి ఒక మంత్రాన్ని మంగళకరంగా పలుకుతున్నాం.

అమృతాపిథాన మసి రౌరవేఽ పుణ్య నిలయే పద్మార్బుద నివాసినాం
అర్థినాం ఉదకం దత్తం అక్షయ్య ముపతిష్ఠతు ॥

భుజించిన ఆహారానికి ఆచ్ఛాదనము (అపిథానం) అయిన జలము రౌరవాది నరకాల్లో ఉన్న వాళ్ళందరికి కూడా అందాలని, వారు కూడా తృప్తి చెందాలని పరితపించిన మహితాత్ములు మన పూర్వీకులు.

దేశోఽ యం క్షోభ రహితః - దేశ మంతా క్షోభ లేకుండా ఉండాలి.

సర్వః సర్వత్ర నన్దతు - నేను ఆనందించినట్లే అందరూ అన్నిచోట్ల ఆనందించాలి అని ప్రార్థించిన మహర్షుల రక్తం మనలో ఇంకా గడ్డ కట్టలేదు.

మైత్రీ మశేష భూతాని పుష్యన్తు సకలే జనే - సర్వభూతముల యెడ మైత్రీ భావంతో ఉండేలా అనుగ్రహించ మని ప్రార్థించారు మన పెద్దలు.

ఆ ప్రార్థనా కుసుమాలు వాడేవి కావు. మనం వాటిని వీడకుండా ఉంటే చాలు.

ఈ క్షణం నుండి, పరుల దోషాలు మన కొద్దు. అవి మనలో కూడా ఉన్నాయి.

మనలో దోషా లున్నాయని మనల్ని మనం నిరసించుకోవడం లేదు. ఇతరులు కూడా మన లాంటివారే.

గాలి అందరికీ సమానంగా వీచినట్లు, మనం అందరినీ ఒకేలా ప్రేమిస్తాం.

అవగాహన మనందరికి ఒకేసారి ఏర్పడింది. ప్రేమించడం కూడా ఒకేసారి ఏకకాలంలో ప్రారంభిస్తాం. ప్రారంభించండి. ఇదే సమయం. ఎవరికి వారుగా ఏర్పరచుకోవాలి నియమం.

ఇది **కదంబ ముకుళ న్యాయము ....**

కడిమి చెట్టులోని మొగ్గలన్నీ ఒకేసారి విరబూస్తాయి.

ప్రేమతో మన హృదయా లన్నీ ఒకేసారి విచ్చుకుంటున్నాయి.


పరిమళాలు ప్రపంచాన్ని పలకరించనీ; సురభిళాలు ప్రపంచంలో చెలాయించనీ.

నింగి నేల కలిసి ఉంటే నిత్యము కళ్యాణము.

నది అంబోధి కలిసిపోతే సత్యమే తోరణము.

అనన్య భక్తి

స్వామి సుందర చైతన్యానంద



అన్యము అంటే వేరైనది. అనన్యము అంటే వేరు కానిది. అనన్య భక్తి అంటే, భగవంతుని కన్నా అన్యంగా మరొక ఆలోచన లేకుండా ఉండటము అని అర్థము. అట్టి అనన్య చింతనము కలవారే అనన్య భక్తులు. భక్తుని దేహం దేశంలో చరిస్తున్నా, కర్మలలో కదులుతున్నా, భక్తుని మనస్సులో మాత్రం భగవంతుడే ఉంటాడు. భగవంతుడు ఉండటము అంటే, భగవద్భావన ఉండటము అని అర్థం. భక్తి అనేది పరమ ప్రేమ స్వరూపము. ప్రేమ ఎక్కడ ఉంటుందో మనస్సు అక్కడే ఉంటుంది. ప్రియమైన వస్తువు నుండి మనస్సు దూరం కాలేదు. భక్తి ద్వారా పరమేశ్వరుడే ప్రియాతి ప్రియంగా మారినపుడు, పరమేశ్వరునికి దూరంగా మనస్సు మనుగడను సాగించ లేదు. అదే అనన్య భక్తి. అట్టి భక్తి చేత పరమేశ్వరునే ఏకైక ధ్యేయంగా భావించి సేవించడం జరుగుతుంది.

వాసుదేవుడే భగవంతుడు. వాసుదేవునికి మించిన దైవము లేదు ***(న అన్యః భగవతః వాసుదేవాత్ పరః అస్తి).*** అట్టి వాసుదేవుడే నాకు గతి ***(స ఏవ నో గతిః)*** అనే నిశ్చయ బుద్ధియే అనన్య యోగము. అట్టి యోగంతో ఈశ్వరుడైన వాసుదేవుని యందు అచంచలమైన భక్తిని కలిగి ఉండటము కూడా జ్ఞానమే ***(తేన భజనం భక్తిః। సా చ జ్ఞానమ్).*** భగవద్భక్తి వలన భగవ దనుగ్రహము ప్రాప్తిస్తుంది. ఈశ్వరానుగ్రహము వలన జ్ఞానము కలుగుతుంది. వాసుదేవుడే నాకు గతి, వాసుదేవునికి మించిన దైవము లేదు అనే అనన్య భక్తి ఏర్పడి నపుడు మోక్షమే పరమావధిగా ఆ భక్తి సాగుతూ ఉందని భావము.

ఇలా అనన్య యోగము చేత కొనసాగే వాసుదేవ భక్తిలో జ్ఞానసాధన లన్నీ ఒదిగి ఉంటాయి. కనుకనే, భక్తి లేకుండా ముక్తిని సాధించటం దుస్సాధ్యము. వాసుదేవుని యందు అచంచల భక్తి కలవారు శీఘ్రంగా జ్ఞానులై తరిస్తారు. అది లేని వారు తరించ లేరు అని వాసుదేవుడే తన దివ్య వాణిని వినిపించాడు.

ప్రీతి ర్న యావన్మయి వాసుదేవే న ముచ్యతే దేహ యోగేన తావత్!

'వాసుదేవుడ నైన నా యందు ఎంత వరకు ప్రీతి కలగదో, అంతవరకు దేహ సంబంధము గల జన్మల నుండి విముక్తి లభించదు'.

అన్యుల యందు మనస్సు లేని వారు అనన్య భక్తులు. అనన్య భక్తి కలిగితే, అన్యచింతలు వాటంతట అవే జారి పోతాయి. పారి పోతాయి. అనన్య భక్తి వల్ల భక్తుని హృదయంలో సదా భగవంతుడే ఉంటాడు. భక్తుని హృదయంలో భగవంతుడు ఉన్నాడు కనుక, భక్తుడు నిర్భయుడు. ఏ అవసరములు లేని వాడు. భక్తుని అనన్య చింతనము

బ్రతుకులో సర్వ చింతలను దూరం చేస్తుంది. భక్తి భగవంతుణ్ణి భక్తుని అధీనంలో ఉంచుతుంది. భక్తుడు సదా అనన్య భక్తిలో తృప్తి చెందుతూ ఉంటే, భక్తుని అవసరాలను భగవంతుడే చూసుకుంటూ ఉంటాడు. భక్తుని అవసరాలను చూడటం తన బాధ్యతగా భగవంతుడే స్వయంగా ప్రకటించు కున్నాడు ***(యోగ క్షేమం వహామ్యహం).***

తమ అనన్య భక్తి చేత భక్తులు భగవంతునికి ముఖ్యు లవుతారు ***(భక్తాః ఏకాంతినో ముఖ్యాః).*** భగవంతునితో నిత్య సంబంధాన్ని కలిగిన వారవుతారు.


అనన్య భక్తి అనేది అనేక జన్మల పుణ్యఫల విశేషం. నిరంతరాభ్యాసం వల్ల ప్రాప్తించే భగవ దనుగ్రహం. అనన్య భక్తి తత్పరులైన ఏకాంత భక్తుల హృదయాలలో పరమేశ్వరుడు తప్ప మరొకటి ఉండే అవకాశం లేదు. వాళ్ళు కేవలం భగవచ్ఛరణులు.

అనన్య భక్తిలో రమించే ఏకాంత భక్తులు భగవంతుని కన్నా అన్యమైన సమస్త విషయాలలో ఉపేక్షా భావాన్ని కలిగి ఉంటారు. చివరికి బ్రతుకులో గాని, చావులో గాని, చెక్కు చెదరని, మొక్కవోని భక్తి తోనే శోభిస్తూ ఉంటారు. పరమశ్వరుని క్షణం విడిచి జీవించ లేరు. బ్రతుకులో ఏదైనా జరగనీ. బుద్ధిలో భక్తిని మాత్రమే ప్రధానంగా ఉంచుకుంటారు. క్షణక్షణానికి పెంచుకుంటారు.

భక్తులు సదా పరమేశ్వరుని యందే మనస్సును లగ్నం చేసి ఉంటారు కనుక, వారికి అనిత్యమైన ప్రాపంచిక విషయాలతో సంగత్వం ఉండదు ***(సంగం త్యజతి).*** మనస్సును ఖాళీ చేసుకొని, మాధవుని చేతిలో మురళి లాగా భక్తులు పనిముట్లుగా మారుతారు కనుక కర్తృత్వము లేనివారై ఉంటారు. కర్తృత్వము లేనందున కర్మఫలాల యందు దృష్టి లేనివారై ఉంటారు ***(కర్మఫలం త్యజతి).*** మురళి ద్వారా అద్భుతమైన రాగాలను పలికించినట్లు, తన చేతిలో పరికరాలుగా మారిన భక్తుల ద్వారా పరమేశ్వరుడు అసమానమైన, అనితర సాధ్యమైన కార్యాలను ఆవిష్కరిస్తాడు. తన ద్వారా ఏ రాగం పలికినా, అందులో పరమేశ్వరుని వైభవాన్నే మురళి వీక్షించినట్లు, తమ ద్వారా ఎంతటి మహా కార్యాలు జరిగినా, అవన్నీ భగవ దనుగ్రహ ప్రసాదాలుగా భక్తులు భావిస్తారు. ద్వంద్వాలను దాటి పోతారు ***(నిర్ద్వన్ద్వో భవతి).*** ఈ విధమైన ఏకాంత భక్తి ప్రాప్తించ గానే భక్తుడు యోగక్షేమాలను మరచి పోతున్నాడు. వాటిని దాటి పోతున్నాడు ***(యోగ క్షేమం త్యజతి).*** భక్తులు భగవంతుని కార్యంలో నిమగ్నమై ఉన్నారు కనుక, భక్తుల యోగక్షేమాలను భగవంతుడే చూసుకుంటాడు.

(25వ పేజీ తరువాయి)

వీరిరువురిలో ఎవరు భాగ్యవంతులు? ఎవరిది బంగారు జీవితము? తృప్తి అనేది మనకు ఏమి ఉంది అనే దానిపై ఆధారపడి లేదు. మనము ఎలా ఉన్నాము అనే దానిపై ఆధారపడి ఉంది. మరొక దానిపై ఆధారపడ్డ వాళ్ళు తృప్తి చెందిన దాఖలాలు ప్రపంచంలో లేవు. స్వస్థుడైన వానికే నిత్యతృప్తి ఉంటుంది. అతడే నిత్యతృప్తుడు; నిరాశ్రయుడు.



ఆత్మ బంధువులారా,
ఓం నమో భగవతే వాసుదేవాయ.

దీర్ఘకాల సుఖాన్ని ఒకవైపు ఆశిస్తూ, శీఘ్రకాల ఫలితాల కొరకు మరోవైపు శ్రమించటమే మానవుని జీవన విధానంలోని లోపాన్ని సుస్పష్టం చేస్తూ ఉంది.

విద్యార్థి దశలోనే విద్యార్జనకు స్వస్తి పలికి, అవసరం లేకపోయినా ధనార్జన వైపు మరలుతున్న విద్యార్థులు ఎలాంటి భవిష్యత్తును ఊహిస్తున్నారో?

మంచి చదువు, అంతకు మించిన ఉద్యోగము ఉండినా, కోటికి పడగలెత్తాలనే ఉబలాటంతో అక్రమ సంపాదనకు అలవాటుపడి, తరతమ భేదాలను కూడా పాటించక, సమాజ రుధిరాన్ని జలగల్లాగ పీల్చుకొంటున్న అవినీతిపరులు ఈ సృష్టిలో ధర్మాలే లేవని భావిస్తున్నట్లేనా? తమ వర్తమానం భవిష్యత్తుకు అందేది కాదని నిశ్చయించు కున్నట్లేనా?

పది కాలాల పాటు సుఖపడాలని కళ్యాణవేదికపై కాలు పెట్టి, తాళి కట్టిన మరుక్షణం నుండి కట్నాలు, కానుక లంటూ కాంతలను కష్టపెట్టే కలి మానవులకు వివాహము యొక్క విశిష్టత అర్థమైనట్లేనా? గుండెను పగలగొట్టి బండినెక్కి ఊరేగితే ఒరిగేదేమిటో?

సర్వబంధ విముక్తులు కావాలని, సర్వోపద్రవ రహిత స్థితి యైన మోక్షాన్ని పొందాలని తత్త్వ శాస్త్రాన్ని, తాత్త్విక మార్గాన్ని ఎంచుకున్న ముముక్షువులు జిజ్ఞాసను గాలికి వదలి, విత్తానికి ఏ మంత్రం? పదవికి ఏ తంత్రం? వ్యాపారాభివృద్ధికి ఏ యంత్రం? అని దారినపోయే దానయ్య మొదలు, దారిలో పడని సన్యాసి వరకు కాలికి బలపం కట్టుకొని తిరుగుతూ ఉన్నారంటే, మతి చెడిన ఈ ముముక్షువులు ఏమి పొందాలను కుంటున్నారు? వీరిని ప్రేరేపించి, ప్రోత్సహించే జ్ఞానహీనులు ఏమి సాధించాలను కుంటున్నారు?

ఇటీవల ఒక వ్యక్తి ముప్పై సంవత్సరాల తరువాత నన్ను కలిసి, బాల్యంలో అర్థాంతరంగా ఆగిపోయిన చదువును కొనసాగించి ఎలాగైనా కళాశాల డిగ్రీని పొందాలని తాను భగీరథ ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పాడు. అతడు ప్రభుత్వోద్యోగి కాడు, డిగ్రీ వచ్చినా ప్రమోషన్ రావటానికి. డిగ్రీ వల్ల తనకు ఏ ఉపయోగం లేదు. అయినా తోకంటూ ఉంటే, అవసర మొచ్చినపుడు ఆడించుకోవచ్చు అని అతని ఉబలాటం.

మధ్యలో, ఒక చిన్న పిడకల వేట. . . . .

ఒక కుర్రాడు ఆ మధ్య నాతో, "స్వామీజీ! ఈ రోజుల్లో, చదువుకున్న వారిలో పట్టభద్రులు కాని వారే ఉండరు. అయినా, పేరు ప్రక్కన బి.ఎ; అని బి.కామ్; అని ఏ కుర్రవాడు వేసుకోడు. మీరు గమనించండి. పాతవాళ్ళు మాత్రం బోర్డు కట్టుకొని మరీ ఊరేగుతుంటారు. ఎందుకని?" అన్నాడు.

ఏం చెప్పాలి నేను? బాబూ! ఎలాగూ విలువ లేనిదే కదా అని కుర్రాళ్ళు తగిలించు కోవటం లేదు. విలువ లేనిదే కదా, తొలగించి మాత్రం సాధించే దేముంటుంది? అని పెద్దోళ్ళు తగిలించుకుంటున్నారేమో! అని, పారేసిన డిగ్రీని గుర్తు తెచ్చుకొని నవ్వి పారేశాను. అంతేగాని, నవ్వును పారేసుకోలేదు. మీరూ నవ్వేయండి పిడకల వేటే గదా!

మళ్ళీ మొదటికొస్తే,

దీర్ఘకాలం కళకళ లాడాలనే కాంక్ష అందరికీ ఉన్నా, శీఘ్రకాలంలో అందుతున్నాయని వెలవెల పోయే తళతళలను తలకెక్కించుకొని తైతక్క లాడటం వలన తలలు బరువెక్కుతాయే గాని జీవితాలు తేలికపడవు.

రాముణ్ణి ప్రక్కనే పెట్టుకొని బంగారు జింకను ఆశించిన సీతమ్మ బంగారు బ్రతుకును బండ బ్రతుకుగా ఎలా మార్చుకొన్నదో మనకు తెలియని విషయం కాదు.

పావనాత్ముడైన శ్రీకృష్ణ పరమాత్మను కాలదన్ని పారిజాత పరిమళాల వైపు పరుగులెత్తిన సత్యభామకు ఒరిగిందేమిటో మనకు తెలిసిందే.

చదువు ఉన్నంత మాత్రాన సంస్కారం తోడౌతుందని చెప్పలేము.

సంస్కారం ఉంటే మాత్రం చదువు దివ్యంగా పరిమళిస్తుంది.

అందుకనే,

చదువు సంస్కారం ఉండాలి అంటుంటారు పెద్దలు. సంస్కారము అనేది వయస్సుకు పరిమితం కాదు. దానికి లింగ భేదం లేదు. రూప భేదం లేదు. అది హాయిగా వీచే గాలి లాంటిది. చల్లగా పారే నది లాంటిది.

'శబరీ! ఏమి కావాలో కోరుకో?' అన్నాడు రాముడు.

'సుదామా! నీ వాంఛను చెప్పు. తీరుస్తాను' అన్నాడు శ్యాముడు.

'ఎంత తపస్సు చేశావు ఉమా? ఏ ఫలం కావాలి?' అన్నాడు శివుడు.

'ప్రహ్లాదా! చెప్పు నీకు ఏం కావాలి?' అన్నాడు వెన్నుడు.

'నచికేతా? ఏదైనా ఇస్తాను' అని ముందడుగు వేశాడు యముడు.

అందరికీ ఒకే ప్రశ్న. సంస్కారవంతులు కనుక అందరిదీ ఒకే సమాధానం.

'మోక్షమే భూయాత్'

మాకు మోక్షమే కావాలి. తాపస మందారా! మాకు ఇదొక్కటి చాలు. పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి. ఇదే చదువులలో మర్మము. ఇదే మర్మమైన చదువు. రాజవిద్య ఇదే. రాజగుహ్యా మిదే.

మెరిసే వాటి మధ్య మురిసిపడే కన్నా, వలచిన దానిని, కావలసిన దానిని పొందే ప్రయత్నమే శ్రేయస్కరము. దేహికి, దేశానికి ఇదే శ్రీరామ రక్ష.

దేశోయం క్షోభరహితః

ప్రేమతో


ఓం స్వామి సుందర చైతన్యానంద















MY UPLOADS ARCHIVES ORG. LINK:
https://archive.org/details/@sudarshan_reddy330
https://archive.org/details/@sundarachitanyam_ysreddy
https://archive.org/details/@sudarshan_reddy330?query=swami+Sundara+Chaitanyananda
https://archive.org/details/@sudarshan_reddy330?query=swami+Vidyaprakashananda+giri
****

సుందర చైతన్యానంద Telugu wiki link:https://w.wiki/F7kt
సుందర చైతన్య ఆశ్రమం = https://w.wiki/HFyF
చైతన్య భగవద్గీత= https://w.wiki/GcCY
చైతన్య రామాయణము= https://w.wiki/GcCX
చైతన్య భాగవతము= https://w.wiki/GcCW
****

విద్యా ప్రకాశానందగిరి స్వామి Telugu wiki: https://w.wiki/F8JA
గీతా మకరందము = https://w.wiki/Gbjg
****

స్వరాంజలి = https://w.wiki/GwAW
****

OUR BLOGS: https://telugudevotionalswaranjali.blogspot.com/
https://hindudevotionalswaranjali.blogspot.com/
https://sundaravignanagrandalayam.blogspot.com/
https://chaitanyavignanam.blogspot.com/
https://balakrishnaprasadgarimella.blogspot.com/
https://telangana-gundechappudu.blogspot.com/

SRI SHUKABRAHMA ASHRAMAM
https://www.youtube.com/channel/UCBScn
PxbLKRfrDDgQ3oHDwQ

Chitanya Bhagavadgita
www.youtube.com/
@ChitanyaBhagavadgita

Telangana Gundechappudu
http://www.youtube.com/
@TelanganaGundechappudu-d9j







